సంపుటి : 9
సంచిక : 320
బుధవారం
12 ఆగస్టు 2026
పేజీలు : 12
వెల : 2/-
E-PAPER

# విశ్వవాయిస్

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY.

10 YEARS CELEBRATING

SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT


CERCULATED AT : • WEST GODAVARI • VISAKHAPATNAM • SRIKAKULAM • VIJAYANAGARAM • VIJAYAWADA • HYDERABAD • BANGLORE • CHENNAI, • DELHI • MUMBAI • TIRUPATHI • ANANTAPUR • GUNTUR • KADAPA • KHAMMAM • KARIMNAGAR • KURNOOL • NELLORE • NIZAMABAD • ONGOLE

విశ్వవాయిస్
వార్తా ప్రపంచం ఇప్పుడు మీ చేతుల్లో!
ఈ-పేపర్ కోసం వెంటనే స్కాన్ చేయండి!
వెంటనే స్కాన్ చేయండి!
ఇప్పుడే చదవండి!
Contact For Ads:
7579339999

అమరావతి సీడ్‌యాక్సెస్

## రోడ్డు పనులకు లైన్ క్లియర్


పిటిషన్లు కొట్టివేసిన హైకోర్టు



అమరావతి, అమరావతి, ఆగస్టు 11, విశ్వం వాయిస్ న్యూస్ : ఏపీ రాజధాని అమరావతి సీడ్‌యాక్సెస్ రోడ్డు పనులకు అడ్డంకులు తొలగాయి. రోడ్డు నిర్మాణానికి అవసరమైన భూసేకరణపై ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్‌ను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లను హైకోర్టు కొట్టివేసింది. సీడ్ మిగతా .. 2లో..

దేశ నిర్మాణంలో

# భాగస్వాములు కండి



'పార్ట్‌నర్స్ ఇన్ నేషన్ బిల్డింగ్'కు సీఎం చంద్రబాబు పిలుపు
'రోడ్ డాక్టర్' పేరుతో గుంతల్లేని రహదారుల మిషన్
ప్రజలు, ఉద్యోగులు అంతా భాగస్వాములు కావాలని సూచన
జులై నెలలో 10.70 శాతం ఆర్థిక వృద్ధి నమోదు
ఎల్ నినో ప్రభావంపై అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిక

అమరావతి, ఆగస్టు 11, విశ్వం వాయిస్ న్యూస్ : ప్రజలు, ఉద్యోగులు, అధికారుల సమష్టి భాగస్వామ్యంతో 'పార్ట్‌నర్స్ ఇన్ నేషన్ బిల్డింగ్' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. రాష్ట్రంలో గుంతలు లేని రహదారులే లక్ష్యంగా 'రోడ్ డాక్టర్' పేరుతో 'జీరో పాట్ హోల్ మిషన్'ను యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని అధికారులను ఆదేశించారు. మంగళవారం సచివాలయంలోని ఆర్టీజీఎస్ కేంద్రం నుంచి వివిధ శాఖల పనితీరుపై ఆయన ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత సులభతరంగా చేరువ చేయడం ద్వారా ప్రతి ఒక్కరినీ జాతి నిర్మాణంలో మిగతా .. 2లో..

## 'సూడో అభిమానులు'తో జాగ్రత్త

అంతర్గత కలహాలకు తావివ్వొద్దు



అమరావతి, ఆగస్టు 11, విశ్వం వాయిస్ న్యూస్ : ఆంధ్రప్రదేశ్‌లో ఎన్డీయే భాగస్వామ్య పక్షాలైన తెదేపా, జనసేన, భాజపా సోషల్ మీడియా కార్యకర్తలు, అభిమానులు పరస్పర విమర్శలు మానుకోవాలని కూటమి అధినాయకత్వం స్పష్టం చేసింది. మిత్రపక్షాల నాయకులపై దాడికి పాల్పడితే ఎంతటివారైనా కఠిన చర్యలు తీసుకుంటామని ఎన్డీయే సోషల్ మీడియా కోఆర్డినేషన్ కమిటీ స్పష్టం చేసింది. కూటమి నాయకుల మధ్య విభేదాలు సృష్టించేందుకు ప్రతిపక్ష వైకాపాకి చెందిన ఫేక్ అకౌంట్లు, సూడో అభిమానులు కుట్ర పన్నుతున్నారని ప్రకటనలో వెల్లడించింది. ఒక పార్టీ అభిమానిలా నటిస్తూ మరో మిత్రపక్ష నాయకులను, వారి కుటుంబ సభ్యులను లక్ష్యంగా చేసుకుని దుష్ప్రచారం చేస్తున్నారని, ఈ ముసుగు దాడులను తిప్పికొట్టేందుకు ఉమ్మడి కార్యాచరణను సిద్ధం చేసినట్లు తెలిపింది. సోషల్ మీడియాలో అనుమానాస్పద పోస్టులు కనిపిస్తే ఆవేశపడకుండా వెంటనే పార్టీల దృష్టికి తీసుకురావాలని సూచించింది. అంతర్గత కలహాలకు తావులేకుండా సంయమనం పాటిస్తూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడమే ప్రధాన లక్ష్యంగా పనిచేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చింది.

తిరుమలలో బుధవారం

## ఎస్ఎస్‌డీ టోకెన్ల జారీ నిలిపివేత



తిరుపతి, ఆగస్టు 11, విశ్వం వాయిస్ న్యూస్ : తిరుపతిలోని శ్రీనివాసం, విష్ణు నివాసం, భూదేవి కాంప్లెక్స్ వద్ద ఎస్ఎస్‌డీ టోకెన్ల జారీని బుధవారం నిలిపేయనున్నట్లు తితిదే మంగళవారం ప్రకటించింది. గురువారం దర్శనానికి సంబంధించి బుధవారం జారీ చేయనున్న టోకెన్లు ఇవ్వరని.. భక్తులు నేరుగా తిరుమలకు చేరుకుని సర్వదర్శనం చేసుకోవాలని విజ్ఞప్తి చేసింది. శుక్రవారం దర్శనానికి మిగతా .. 2లో..

దేశవ్యాప్తంగా

## పాస్‌పోర్టు సేవల్లో అంతరాయం

ప్రజల పడిగాపులు



ఆగస్టు 11, విశ్వం వాయిస్ న్యూస్ : దేశవ్యాప్తంగా పాస్‌పోర్టు సేవల్లో అంతరాయం ఏర్పడింది. సర్వర్లు పనిచేయకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. హైదరాబాద్, విజయవాడ, మిగతా .. 2లో..

## ఆక్వా రంగానికి 'పవర్' ఊరట

ఆక్వారంగానికి రూ. 1,150 కోట్ల విద్యుత్ సబ్సిడీ జీవోను విడుదల
జగన్ చవకబారు రాజకీయాలు చేస్తున్నారని మండిపాటు
వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు




పాలకొల్లు, ఆగస్టు 11, విశ్వం వాయిస్ న్యూస్ : రాష్ట్రాన్ని ఐదేళ్లపాటు వెంటిలేటర్‌పై పడేసిన వాళ్లకు, తాడేపల్లి ప్యాలెస్ దాటని మాజీ సీఎం జగన్‌కు ఆక్వా రైతుల కష్టాల గురించి మాట్లాడే హక్కే లేదంటూ వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. గొడ్డలి పార్టీతో ప్రజలు జాగ్రత్తగా ఉండకపోతే భవిష్యత్తుకే ప్రమాదమని ఆయన హెచ్చరించారు. సంక్షోభంలో ఉన్న ఆక్వా రంగానికి ఊపిరి పోస్తూ రూ.1,150 కోట్ల విద్యుత్ సబ్సిడీకి సంబంధించిన మిగతా .. 2లో..

'మూన్ మిషన్' కోసం

## చేతులు కలపండి

ఇస్రోకు నాసా ఆహ్వానం



ఆగస్టు 11, విశ్వం వాయిస్ న్యూస్ : అంతరిక్ష పరిశోధనల్లో దూసుకెళ్తున్న ఇస్రో.. చంద్రుడిపై కీలక పరిశోధనలు చేస్తున్న సంగతి విషయం తెలిసిందే. అమెరికా కూడా.. చంద్రుడి దక్షిణ ధ్రువంపై 2032 నాటికి శాశ్వత మానవ స్థావరం ఏర్పాటు మిగతా .. 2లో..

## నకిలీ పోలీసులతో ర్యాలీలా?

వైసీపీపై హోంమంత్రి అనిత నిప్పులు



అమరావతి, ఆగస్టు 11, విశ్వం వాయిస్ న్యూస్ : నకిలీ పోలీసులతో ర్యాలీలు నిర్వహిస్తూ వైసీపీ నాయకులు రాష్ట్ర పోలీసు వ్యవస్థను తీవ్రంగా అవమానిస్తున్నారని ఆంధ్రప్రదేశ్ హోంమంత్రి వంగలపూడి అనిత తీవ్రస్థాయిలో మండిపడ్డారు. కేవలం ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు, రాజకీయ ప్రయోజనాల కోసమే ఆ పార్టీ నేతలు ఇలాంటి దిగజారుడు చర్యలకు ఒడిగడుతున్నారని ధ్వజమెత్తారు. అసలు నకిలీ పోలీసుల ముసుగులో ర్యాలీలు చేస్తూ సమాజానికి ఏం సందేశం ఇవ్వాలనుకుంటున్నారని ప్రశ్నించిన ఆమె, ముసుగులు వేసుకుని క్రిమినల్ రాజకీయాలు చేసేవారికి రాజకీయాల్లో కొనసాగే అర్హతే లేదని తేల్చి చెప్పారు. పోలీసు వ్యవస్థ గౌరవాన్ని, విశ్వసనీయతను దెబ్బతీసే ఏ ఒక్క చర్యను కూడా కూటమి ప్రభుత్వం ఉపేక్షించబోదని హోంమంత్రి స్పష్టం చేశారు. స్వార్థ రాజకీయాల కోసం ప్రభుత్వ వ్యవస్థలను దిగజార్చాలని చూస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని మిగతా .. 2లో..

మైనర్ బాలికపై సచివాలయ

## ఉద్యోగి అత్యాచారం

సహకరించిన తల్లి

అనకాపల్లి పట్టణం, ఆగస్టు 11, విశ్వం వాయిస్ న్యూస్ : సభ్య సమాజం తలదించుకునే సంఘటన అనకాపల్లి పట్టణంలో చోటుచేసుకుంది. మైనర్ బాలికపై ఓ సచివాలయ ఉద్యోగి అత్యాచారం చేయగా.. దీనికి బాధితురాలి కన్నతల్లి సహకరించింది. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సచివాలయం ఉద్యోగి, ఆమె తల్లిపై అనకాపల్లి పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అనకాపల్లి పట్టణానికి చెందిన ఓ మహిళ భర్తతో విభేదాల కారణంగా ఇంటర్ చదువుతున్న కుమార్తెతో కలిసి విడిగా ఉంటోంది. అనకాపల్లిలోని చేపల మార్కెట్ సచివాలయం మిగతా .. 2లో..

నారా లోకేష్ అంటే

## జగన్‌కు భయం

బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత



గుంతకల్లు, ఆగస్టు 11, విశ్వం వాయిస్ న్యూస్ : వైకాపా అధ్యక్షుడు జగన్‌కు మంత్రి నారా లోకేశ్ అంటే భయమని బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత అన్నారు. డీఎస్సీపై నారా లోకేశ్ చర్చకు పిలిచినా జగన్ భయపడి రావడం లేదని చెప్పారు. ఎప్పుడో జరిగిన మెగా డీఎస్సీలో అక్రమాలు జరిగాయని వైకాపా నేతలు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. అనంతపురం జిల్లా గుంతకల్లులో రూ.18కోట్లతో నిర్మించిన మహాత్మా జ్యోతిబా ఫులే బీసీ గురుకుల మిగతా .. 2లో..

ఆ సంస్థతో సీఎం రేవంత్ సోదరులకు

## సంబంధం లేదు

తెలంగాణ మంత్రి శ్రీధర్‌బాబు




హైదరాబాద్, ఆగస్టు 11, విశ్వం వాయిస్ న్యూస్ : టెసరాట్ సంస్థకు భూ కేటాయింపుల అంశంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన ఆరోపణల్లో వాస్తవం లేదని తెలంగాణ మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. సీఎం సోదరులకు భూ కేటాయింపులు చేశారంటూ ఆయన అవా స్తవాలు మాట్లాడుతున్నారని ఆక్షేపించారు. మీడియాతో చిట్‌చాట్‌లో శ్రీధర్‌బాబు మాట్లాడారు. "బీఆర్ఎస్ హయాంలో మిగతా .. 2లో..

కేంద్ర హోం మంత్రి ఈ రోజు కూడా

## లోక్‌సభకు హాజరు కాలేదు : కాంగ్రెస్



ఆగస్టు 11, విశ్వం వాయిస్ న్యూస్ : విద్యార్థుల నిరసనలు, పోలీసు చర్యపై కేంద్ర హోం మంత్రి అమిత్ షా వివరణ ఇవ్వాలంటూ ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. ఈ క్రమంలోనే మంగళవారం సైతం లోక్‌సభకు అమిత్ షా రాలేదంటూ కాంగ్రెస్ విమర్శలు ఎక్కుపెట్టింది. గద్దించేవారే పిరికివారని ఆయన మరోసారి నిరూపించినట్లు పార్టీ సీనియర్ నేత జైరాం రమేశ్ 'ఎక్స్' వేదికగా పోస్టు పెట్టారు. "వాస్తవాలను పక్కనపెట్టేందుకు ఎన్నో ప్రయత్నాలు జరిగాయి. అయినప్పటికీ.. కేంద్ర హోం మంత్రి ఈ రోజు కూడా లోక్‌సభకు హాజరు కాలేదు. 17 రోజులుగా మిగతా .. 2లో..




డీఎస్సీ వ్యవహారంపై

## సీబీఐ విచారణ జరగాల్సిందే..



నారా లోకేశ్ తక్షణమే రాజీనామా చేయాలి : రోజా
పుత్తూరులో రోజా ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ

పుత్తూరు, ఆగస్టు 11, విశ్వం వాయిస్ న్యూస్ : కూటమి ప్రభుత్వం చేపట్టిన మెగా డీఎస్సీలో భారీగా అక్రమాలు, అవకతవకలు జరిగాయని, ఈ కుంభకోణానికి బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని మాజీ మంత్రి, వైసీపీ నాయకురాలు ఆర్కే రోజా డిమాండ్ చేశారు. నిరుద్యోగులను నట్టేట ముంచిన డీఎస్సీ ప్రక్రియపై సీబీఐ చేత తటస్థ విచారణ జరిపించాలని కోరుతూ నగరి నియోజకవర్గం పుత్తూరు పట్టణంలో ఆమె ఆధ్వర్యంలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహం వద్ద ఆమె మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇచ్చిన మిగతా .. 2లో..

## రాయలసీమపై వైసీపీది కపట ప్రేమ

ఇప్పుడు అభివృద్ధిని చూసి వాళ్లకి కళ్లు మండుతున్నాయి : ఎమ్మెల్సీ భూమిరెడ్డి



రాయలసీమ, ఆగస్టు 11, విశ్వం వాయిస్ న్యూస్ : రాయలసీమ ప్రాంత అభివృద్ధి పరుగులు పెడుతుంటే చూసి ఓర్వలేక వైసీపీ నేతలు కళ్లు మూసుకుని విమర్శలు చేస్తున్నారని, రైతుల పేరుతో రాజకీయ డ్రామాలకు తెరలేపారని టీడీపీ ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఐదేళ్లపాటు రాయలసీమను గాలికొదిలేసిన జగన్ రెడ్డి, ఇప్పుడు ప్రాజెక్టుల సందర్శనల పేరుతో తీర్థయాత్రలు చేయడం విడ్డూరంగా ఉందని ఆయన ఎద్దేవా చేశారు. నేడు మంగళగిరిలోని ఎన్టీఆర్ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. "వంద పీనుగులను తిన్న రాబందు పాప ప్రక్షాళన కోసం తీర్థయాత్రలకు వెళ్లినట్లుగా ఉంది వైసీపీ నేతల తీరు" అని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మిగతా .. 2లో..

(మొదటిపేజీ తరువాయి)

# భాగస్వాములు కండి

భాగస్వాములను చేయాలని ఆకాంక్షించారు. వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర లక్ష్యాల సాధనకు ప్రతి అధికారి, ఉద్యోగి అంకితభావంతో కృషి చేయాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా దెబ్బతిన్న రహదారులకు తక్షణమే మరమ్మతులు చేపట్టేలా 'రోడ్ డాక్టర్' కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని స్పష్టం చేశారు. ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి పనులను చిత్తశుద్ధితో చేపట్టినప్పుడు ప్రజల మద్దతు ఎప్పుడూ ఉంటుందని, భోగాపురం విమానాశ్రయ పనుల పురోగతికి లభిస్తున్న స్పందనే ఇందుకు నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. వాస్తవాలను ప్రజలకు వివరిస్తే వారే ప్రభుత్వానికి అండగా నిలుస్తారని, కర్నూలులో డీఎస్సీ-2025 ఉపాధ్యాయ అభ్యర్థులు చేపట్టిన కార్యక్రమమే ఇందుకు ఉదాహరణ అని తెలిపారు. జులై నెలలో రాష్ట్రం 10.70 శాతం ఆర్థిక వృద్ధిని సాధించిందని వెల్లడించిన ఆయన, రాబోయే రోజుల్లో ఎల్ నినో ప్రభావం తీవ్రంగా ఉండే అవకాశం ఉన్నందున ఎదురయ్యే సవాళ్లను అధిగమించేందుకు సిద్ధంగా ఉండాలని హెచ్చరించారు. ఈ సమీక్షా సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్‌తో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# రోడ్డు పనులకు లైన్ క్లియర్

యాక్సెస్ రోడ్డు నిర్మాణానికి అవసరమైన భూసేకరణ విషయంలో అధికారులు చట్ట నిబంధనలను అనుసరించలేదని.. భూసేకరణ నోటిఫికేషన్, దానికి అనుగుణంగా ఇచ్చిన ప్రొసీడింగ్స్‌ను రద్దు చేయాలని పలువురు రైతులు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ప్రభుత్వం తరఫున ఏజీ దమ్మాలపాటి శ్రీనివాస్ వాదనలు వినిపించారు. నిబంధనల ప్రకారమే భూసేకరణ చేపడుతున్నామని కోర్టుకు తెలిపారు. వాదనలు విన్న ఉన్నత న్యాయస్థానం ఇటీవల తీర్పును ఇటీవల రిజర్వు చేసింది. తాజాగా ఆ పిటిషన్లను కొట్టివేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. విస్తృత ప్రయోజనాల దృష్ట్యా ప్రక్రియను అడ్డుకోలేమని హైకోర్టు పేర్కొంది.

# ఎస్ఎస్‌డీ టోకెన్ల జారీ నిలిపివేత

సంబంధించి గురువారం మధ్యాహ్నం టోకెన్లు జారీ చేస్తారని తెలిపింది. భక్తులు గమనించి సహకరించాలని కోరారు. అయితే టోకెన్ల జారీ నిలిపివేతపై భక్తులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఎస్ఎస్‌డీ టోకెన్లు లేకుండా వచ్చిన వారికి వచ్చినట్లు సర్వదర్శనం చేయించే ఆలోచనతో తితిదే ఈ విధానాన్ని గత ఆరు నెలల్లో 7 వారాల పాటు ప్రయోగాత్మకంగా పరిశీలిస్తోంది. టోకెన్ల జారీ చేయకపోవడంతో దూర ప్రాంత భక్తులకు అవస్థలు తప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తిరుమల శ్రీవారి దర్శనానికి సంబంధించి మంగళవారం ఉదయం ఆరు గంటలకే పది వేల ఎస్ఎస్‌డీ టోకెన్లు జారీ చేశారు. వీరికి బుధవారం మధ్యాహ్నం 12 నుంచి రాత్రి 10 గంటల వరకు దర్శనం కానుంది. అదేవిధంగా శ్రీవారి మెట్టు మార్గంలో వెళ్లే భక్తులకు 2 వేల టోకెన్లు జారీ చేశారు.

## ఉద్యోగి అత్యాచారం

ఉద్యోగిగా పనిచేస్తున్న భార్గవ్ ప్రకాశ్‌తో ఆ మహిళకు పరిచయం కాగా, ఇద్దరి మధ్య వివాహేతర సంబంధం ఏర్పడింది. ఈ క్రమంలో భార్గవ్ కన్ను మహిళ కుమార్తెపై పడింది. దీంతో తన కోరికను సదరు మహిళకు చెప్పడంతో ఆమె ఈ నెల 7న కుమార్తెను భార్గవ్ వద్దకు తీసుకెళ్లింది. అతడు అత్యాచారం చేయడంతో మనస్తాపానికి గురైన బాలిక ఆత్మహత్యకు యత్నించింది. దీంతో ఆమెను అనకాపల్లిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్చి చికిత్స అందించారు. జరిగిన విషయాన్ని బాలిక పోలీసులకు చెప్పడంతో వారు దర్యాప్తు చేపట్టారు. అనంతరం భార్గవ్, ప్రోత్సహించిన తల్లిపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు ఇన్‌ఛార్జి డీఎస్పీ జీఆర్ఆర్ మోహన్ తెలిపారు.

# పాస్‌పోర్టు సేవల్లో అంతరాయం

తిరుపతిలోని పాస్‌పోర్టు కార్యాలయాల్లో సర్వర్లు పనిచేయకపోవడంతో సుదూర ప్రాంతాల నుంచి అక్కడికి వచ్చిన ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. విజయవాడలో పెద్ద ఎత్తున ప్రజలు ఉదయం నుంచీ పడిగాపులు కాస్తున్నారు. వీరిలో అత్యధికంగా విద్యార్థులు ఉన్నారు. కేటాయించిన స్లాట్ ప్రకారం వచ్చామని.. సాంకేతిక సమస్యపై అధికారులు ముందస్తు సమాచారం ఇవ్వలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇవాళ్టి అపాయింట్‌మెంట్లను మరో రోజుకు రీషెడ్యూల్ చేసినట్లు అధికారులు తెలిపారు.

# ఆక్వా రంగానికి 'పవర్' ఊరట

జీవోను మంత్రి విడుదల చేశారు. పాలకొల్లులో ఆక్వా రైతులు ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభకు మంత్రులు గొట్టిపాటి రవికుమార్, నిమ్మల రామానాయుడు, అసెంబ్లీ ఉపసభాపతి రఘురామకృష్ణరాజులతో కలిసి అచ్చెన్నాయుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆక్వారంగం అనేది సీఎం చంద్రబాబు నాయుడి మానసపుత్రిక అని అభివర్ణించిన ఆయన, ఐదు కోట్ల ఆంధ్రులు చేసుకున్న పూర్వజన్మ సుకృతం వల్లనే చంద్రబాబు వంటి దార్శనిక నేత దక్కారని కొనియాడారు. 2019లో ప్రజలు ఆవేశపడి దోపిడీదారులకు అధికారం కట్టబెట్టడం వల్లే రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ ఐదేళ్లపాటు తీవ్ర ఐసీయూ స్థితిలోకి వెళ్లిందని, నాటి వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు ఇప్పుడు జగన్ ప్రతి చిన్న విషయాన్నీ సమస్యగా చిత్రీకరించే చవకబారు రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. ఎంతటి నిధుల కొరత ఉన్నప్పటికీ ఆక్వా రైతులను ఆదుకోవాలనే ఏకైక సంకల్పంతో ఈ భారీ విద్యుత్ సబ్సిడీని సకాలంలో విడుదల చేశామని మంత్రి వెల్లడించారు. మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రతీ హామీతో పాటు, చెప్పని అనేక సంక్షేమ కార్యక్రమాలను సైతం ఈ 26 నెలల స్వల్ప వ్యవధిలోనే నెరవేర్చామని గర్వంగా ప్రకటించారు. ప్రధాని నరేంద్ర మోదీ సాయంతో ఏపీ అభివృద్ధి పథంలో పరుగులు తీస్తోందని, రాష్ట్రానికి ఉన్న సుదీర్ఘ తీరప్రాంతాన్ని ప్రధాన ఆదాయ వనరుగా మారుస్తూ 'బ్లూ ఎకానమీ' దిశగా ఆంధ్రప్రదేశ్‌ను సరికొత్త శిఖరాలకు తీసుకెళ్తున్నామని చెప్పారు.

# 'మూన్ మిషన్' కోసం చేతులు కలపండి

చేసేందుకు తీవ్రంగా కృషి చేస్తోంది. ఈ క్రమంలో ఇటీవల తలపెట్టిన మూన్ బేస్ మిషన్‌లో భాగం కావాలని భారత అంతరిక్ష పరిశోధనా సంస్థను నాసా ఆహ్వానించింది. ఇండియా-యూఎస్ సివిల్ స్పేస్ జాయింట్ వర్కింగ్ గ్రూప్ సమావేశం బెంగళూరులోని ఇస్రో ప్రధాన కార్యాలయంలో ఇటీవల జరిగింది. ఈ సందర్భంగా ఇప్పటికే చేసుకున్న ఒప్పందాలను మరింత బలోపేతం చేసుకోవడం, శాస్త్రీయ సమాచారాన్ని పంచుకోవడం, సహకారం, వీటికి సంబంధించిన చర్చలను ముమ్మరం చేసుకునేందుకు ఇరుపక్షాలు అంగీకరించాయి. గతేడాది అమెరికా అధ్యక్షుడు ట్రంప్, భారత ప్రధాని మోదీ చేసిన సంయుక్త ప్రకటనకు అనుగుణంగా ఇరు దేశాలు సాధారణ, వాణిజ్య అంతరిక్ష పరిశోధనల్లో సహకారాన్ని మరింత విస్తరించుకోవడంపైనా ఇరు పక్షాలు ప్రధానంగా దృష్టి సారించాయి. ఈ సందర్భంగా ఇస్రో ఛైర్మన్ నారాయణన్, అమెరికా రాయబారి సెర్గియో గోర్‌లు మాట్లాడుతూ.. ద్వైపాక్షిక అంతరిక్ష సహకారాన్ని మరింత బలోపేతం చేసుకోవాల్సిన అవసరం, దాని ప్రాముఖ్యతను ప్రస్తావించారు.

# నకిలీ పోలీసులతో ర్యాలీలా?

హెచ్చరించారు. ఈ ఘటనలో ర్యాలీలో పాల్గొన్న నకిలీ పోలీసులతో పాటు, వారి వెనకుండి నడిపించిన అసలు వైసీపీ సూత్రధారులపైనా చట్టపరంగా అత్యంత కఠిన చర్యలు తీసుకుంటామని హోంమంత్రి అనిత హెచ్చరించారు.

# జగన్‌కు భయం

పాఠశాల భవనాన్ని స్థానిక ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాంతో కలిసి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. "మరోసారి జగన్‌కు సవాల్ చేస్తున్నా.. మెగా డీఎస్సీలో అక్రమాలు జరిగాయనే ఆధారాలు ఉంటే అసెంబ్లీకి వస్తే చర్చిద్దాం. మంత్రి లోకేశ్ పేరు ఎత్తే అర్హత కూడా జగన్, వైకాపా నేతలకు లేదు. గొడ్డలి పార్టీ చిల్లర రాజకీయాలు చూసి ప్రజలు అసహ్యించుకుంటున్నారు. కూటమి ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యమిస్తోంది. దీనిలో భాగంగానే ప్రస్తుత విద్యా సంవత్సరంలో కొత్తగా పది ఎంజేపీ గురుకుల పాఠశాలలను ప్రారంభించాం. రాయలసీమలో 5, ఉత్తరాంధ్రలో 5 ప్రారంభమయ్యాయి. వాటిలో గుంతకల్లులో అధికంగా ఉన్న బీసీ జనాభాను దృష్టిలో పెట్టుకుని ఇక్కడ ఎంజేపీ గురుకుల పాఠశాలను ప్రారంభించాం" అని సవిత అన్నారు.

# సంబంధం లేదు

ఎకరం రూ.90లక్షలకు ఇస్తే.. మేం రూ.కోటిన్నరకు ఇచ్చాం. బోర్డు డిసైడ్ చేసిన దానికంటే రూపాయి కూడా తక్కువకు ఇవ్వలేదు. 32 మంది దరఖాస్తు చేసుకుంటే అందులో ఒకటి టెసరాట్ కంపెనీ. నిబంధనల ప్రకారమే కేటాయింపులు జరిగాయి. ఆ సంస్థతో సీఎం రేవంత్ సోదరులకు సంబంధం లేదు. సోషల్ మీడియా పోస్టుల ఆధారంగా ఆయన ఆరోపణలు చేయడం.. ఐదు ఎకరాల్లో రూ.34 కోట్లతో ఏర్పాటయ్యే కంపెనీని రూ.200 కోట్ల సంస్థగా కేటీఆర్ చెప్పడం ఆశ్చర్యంగా ఉంది. బీఆర్ఎస్ హయాంలో ముడుపులు తీసుకునే కంపెనీలకు భూములు ఇచ్చారా? తక్కువ ధరకు ఎందుకు ఇచ్చారో కేటీఆర్ సమాధానం చెప్పాలి. మీడియాలో వస్తుందని నోటికొచ్చినట్లు మాట్లాడటం సరికాదు. పీఎం ఏక్తామాల్ టెండర్లు పారదర్శకంగా జరిగాయి. పరిశ్రమలు రావొద్దనే హిడెన్ అజెండాతో కేటీఆర్ ఆరోపణలు చేస్తున్నారు. ఆయన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నాం. నా శాఖలో జరిగే ప్రతి నిర్ణయం నాకు తెలుసు. ఎవరో చెప్తే నేను పనిచేసే రకం కాదు. బీఆర్ఎస్ హయాంలో లీజుకు ఇచ్చిన భూములను రెగ్యులరైజ్ చేశారు. అప్పుడు కేటీఆర్‌కు తప్పనిపించలేదా?బీఆర్ఎస్ తిరిగి అధికారంలోకి రావడం కలలో మాట" అని శ్రీధర్‌బాబు వ్యాఖ్యానించారు.

# లోక్‌సభకు హాజరు కాలేదు : కాంగ్రెస్

లోక్‌సభ, రాజ్యసభలకు ఆయన గైర్హాజరు కావడం అనూహ్యం. ఆయన క్షేమంగానే ఉన్నారా? #1, #2 మధ్య అంతా సవ్యంగానే ఉందా?" అంటూ పరోక్షంగా ప్రధాని మోదీ, అమిత్ షాను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. విద్యార్థుల నిరసనలు, పోలీసు చర్యపై లోక్‌సభలో చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు ఇప్పటికే ప్రకటించారు. ఆ చర్చకు అమిత్ షా సమాధానమిస్తారని స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా.. ఇప్పటివరకు లోక్‌సభ 17 రోజులపాటు జరగ్గా 11 బిల్లులను ఆమోదించింది. వాటిలో రెండింటిపైనే చర్చ జరిగింది. ప్రతిపక్షాల ఆందోళనల మధ్య మిగతా బిల్లులన్నీ చర్చ లేకుండానే ఆమోదం పొందాయి.

# సీబీఐ విచారణ జరగాల్సిందే..

మొట్టమొదటి ఉద్యోగ నోటిఫికేషన్‌లోనే పేపర్ లీకేజీలు, అవినీతి అక్రమాలు రాజ్యమేలాయని రోజా తీవ్రస్థాయిలో ఆరోపించారు. ప్రశ్నాపత్రాన్ని తయారు చేసిన నవీన్ అనే వ్యక్తికే మొదటి ర్యాంక్ రావడమే పేపర్ లీక్ అయిందనడానికి సజీవ సాక్ష్యమని స్పష్టం చేశారు. పేపర్ లీకేజీ నిజం కాకపోతే మొదటి ర్యాంకర్ నవీన్‌కు ఉద్యోగం ఇవ్వకుండా, రెండో ర్యాంక్ నుంచి ఎందుకు నియామకాలు చేపట్టారో ప్రభుత్వం సమాధానం చెప్పాలని సవాల్ విసిరారు. మరోవైపు స్పోర్ట్స్ కోటా పేరుతో దొంగ జీవోలను తెచ్చి, పోస్టులను విచ్చలవిడిగా అమ్ముకుని రూ. కోట్లు దోచుకున్నారని మండిపడ్డారు. విద్యార్థులు, నిరుద్యోగుల భవిష్యత్తుతో ఆడుకోవడం ఆపి, వెంటనే పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో పాటు నిరుద్యోగ భృతిని విడుదల చేయాలని ఆర్కే రోజా డిమాండ్ చేశారు.

# రాయలసీమపై వైసీపీది కపట ప్రేమ

రాయలసీమ అభివృద్ధి చెందుతుండటాన్ని చూసి వైసీపీ నేతలు నీతులు మాట్లాడుతున్నారని, వారి మాయమాటలను సీమ ప్రజలు ఇక నమ్మరని హెచ్చరించారు.

**ప్రాజెక్టులు కొట్టుకుపోతే ఏమయ్యారు?**

వైసీపీ ప్రభుత్వ హయాంలో అన్నమయ్య, పింఛా ప్రాజెక్టులు కొట్టుకుపోయి వందలాది కుటుంబాలు వీధిన పడినప్పుడు జగన్ రెడ్డి ఎందుకు యాత్ర చేయలేదని భూమిరెడ్డి ప్రశ్నించారు. అన్నమయ్య ప్రాజెక్టు ఎందుకు తెగిపోయిందో విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తూ అప్పుడే తాడేపల్లి వరకు పాదయాత్ర చేసి ఉంటే ప్రజలు నమ్మేవారని అన్నారు. గోరకల్లు, అలగనూరు రిజర్వాయర్ల కట్టలు కుంగిపోయినా కనీసం మరమ్మతులకు నిధులు ఇవ్వలేదని, వీటిపై వైసీపీ నేతలు ఎందుకు పాదయాత్రలు చేయలేదని నిలదీశారు. చంద్రబాబు ప్రభుత్వం రాయలసీమ రైతుల కన్నీళ్లు తుడవడానికి ప్రయత్నిస్తుంటే, వైసీపీ నాయకులు నానాయాగీ చేస్తున్నారని విమర్శించారు.

**ఒక్క కలం పోటుతో 102 ప్రాజెక్టులకు అడ్డుకట్ట**

రాయలసీమ సమగ్రాభివృద్ధి కోసం గత టీడీపీ ప్రభుత్వం 102 ప్రాజెక్టులను మంజూరు చేస్తే, జగన్ రెడ్డి ముఖ్యమంత్రి కాగానే జీఓ నంబర్ 365తో ఒక్క కలం పోటుతో ఆ ప్రాజెక్టులన్నింటినీ అడ్డుకున్నారని భూమిరెడ్డి ఆరోపించారు. దశాబ్దాలుగా తమను గెలిపిస్తున్న రాయలసీమ ప్రజలపై జగన్ రెడ్డి ఎందుకు కక్ష కట్టారని ప్రశ్నించారు. కర్నూలు పశ్చిమ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేసే వేదవతి, గుండ్రేవుల ప్రాజెక్టులను అధికారంలోకి రాగానే ఎందుకు రద్దు చేశారని నిలదీశారు. ఆ ప్రాజెక్టులు కొనసాగించి ఉంటే ఆ ప్రాంతంలో వలసలు ఆగిపోయేవని అన్నారు.

**రాయలసీమ ఎత్తిపోతలపై జగన్ సర్కార్ ద్రోహం**

రాయలసీమ ఎత్తిపోతల పథకంపై ఇప్పుడు మాట్లాడుతున్న వైసీపీ నేతలు, వారి ప్రభుత్వ హయాంలో జరిగిన నిర్వాకాన్ని గుర్తుచేసుకోవాలని భూమిరెడ్డి హితవు పలికారు. రూ.3,825 కోట్ల అంచనాతో పథకాన్ని ప్రారంభించి, ఐదు నెలల్లోనే దొంగ బిల్లులతో రూ.950 కోట్లు స్వాహా చేశారని ఆరోపించారు. 2020 అక్టోబర్‌లో నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్జీటీ) స్టే ఇస్తే, నాలుగేళ్ల పాటు ఆ స్టేను ఎత్తివేయడానికి జగన్ ప్రభుత్వం ఎందుకు ప్రయత్నించలేదని ప్రశ్నించారు. పర్యావరణ అనుమతుల కోసం ఒక్క పత్రం కూడా 'పరివేశ్' పోర్టల్‌లో అప్‌లోడ్ చేయలేదని, ఇది రాయలసీమకు చేసిన ద్రోహం కాదా అని నిలదీశారు. అంతేకాకుండా, ఈ పథకాన్ని చెన్నై తాగునీటి అవసరాల కోసం నిర్మిస్తున్నట్లు జీఓ ఇవ్వడం రాయలసీమ ప్రజలను వంచించడమేనని అన్నారు.

**పులివెందులకు నీళ్లిచ్చింది చంద్రబాబే**

జగన్ రెడ్డి ఐదేళ్లు ముఖ్యమంత్రిగా ఉన్నా తన సొంత నియోజకవర్గం పులివెందులలో ఒక్క ఎకరాకు కూడా అదనంగా సాగునీరు ఇవ్వలేకపోయారని భూమిరెడ్డి విమర్శించారు. రాజకీయాలకు అతీతంగా చంద్రబాబు నాయుడు పులివెందులకు కృష్ణా జలాలు తీసుకువచ్చి ఆ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేసిన ఘనతను జగన్ రెడ్డి గుర్తించాలని అన్నారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం హంద్రీ-నీవా ద్వారా కృష్ణా జలాలను రాష్ట్ర సరిహద్దుల్లోని కుప్పం వరకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తోందని తెలిపారు. సాగునీటి ప్రాజెక్టుల ఆధునీకరణకు రాబోయే రెండేళ్లలో రూ.10 వేల కోట్లు ఖర్చు చేయనున్నట్లు వెల్లడించారు.

**అభివృద్ధి, ఉపాధితో రాయలసీమకు కొత్త శోభ**

రాయలసీమను దేశంలోనే ప్రధాన హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు వేల కోట్ల రూపాయలతో ప్రణాళికలు సిద్ధం చేశామని భూమిరెడ్డి తెలిపారు. మదనపల్లిలో త్వరలో చంద్రబాబు ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని చెప్పారు. పరిశ్రమలు, ఉపాధి అవకాశాలతో రాయలసీమకు కొత్త రూపు తీసుకువస్తున్నామని అన్నారు. జమ్మలమడుగులో జేఎస్‌డబ్ల్యూ స్టీల్ ప్లాంట్, సత్యసాయి జిల్లాలో జెట్ ఫైటర్ల తయారీ కర్మాగారాలు, కొప్పర్తిలో ఎలక్ట్రానిక్ పరిశ్రమలు, ఓర్వకల్లులో డ్రోన్ తయారీ యూనిట్లు ఏర్పాటవుతున్నాయని వివరించారు. ఈ అభివృద్ధిని చూసి ఓర్వలేకే వైసీపీ నేతలు మళ్లీ ప్రాంతీయ విద్వేషాలను రెచ్చగొట్టాలని చూస్తున్నారని, వారి కుట్రలు ఫలించవని హెచ్చరించారు. రైతులు కోరిన వెంటనే 90 శాతం సబ్సిడీతో డ్రిప్ పరికరాలు అందిస్తున్నా యాత్రలు చేయడం వైసీపీ దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమని విమర్శించారు. రాయలసీమ ప్రజలు వాస్తవాలను గమనిస్తున్నారని, వైసీపీ రాజకీయ ప్రచారాలను నమ్మే స్థితిలో లేరని భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి స్పష్టం చేశారు.

---

ఎస్బీఐలో భారీ రిక్రూట్‌మెంట్..

# 9 వేలకు పైగా పోస్టులు

**9,124 జూనియర్ అసోసియేట్ పోస్టుల భర్తీకి ప్రకటన**
**ఆగస్టు 11 నుంచి 31 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ**
**హైదరాబాద్ సర్కిల్‌లో 260 ఉద్యోగాల కేటాయింపు**
**ప్రిలిమినరీ, మెయిన్స్ పరీక్షల ద్వారా అభ్యర్థుల ఎంపిక**
**డిగ్రీ ఉత్తీర్ణులైన వారు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులు**

**ఆగస్టు 11, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రభుత్వ రంగ 'స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా' (ఎస్బీఐ) నిరుద్యోగులకు శుభవార్త అందించింది. దేశవ్యాప్తంగా 9,124 జూనియర్ అసోసియేట్ (కస్టమర్ సపోర్ట్ & సేల్స్) పోస్టుల భర్తీకి మంగళవారం భారీ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ పోస్టులకు ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ ఆగస్టు 11న ప్రారంభం కాగా, అభ్యర్థులు ఆగస్టు 31 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి ఏదైనా విభాగంలో డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థులు ఈ పోస్టులకు అర్హులు. డిగ్రీ చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు కూడా 2026 డిసెంబర్ 31 నాటికి ఉత్తీర్ణత పత్రం సమర్పించే షరతుతో దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం కల్పించారు. 2026 ఏప్రిల్ 1 నాటికి అభ్యర్థుల వయసు 20 నుంచి 28 ఏళ్ల మధ్య ఉండాలి. రిజర్వ్ కేటగిరీల వారికి ప్రభుత్వ నిబంధనల ప్రకారం వయోపరిమితిలో సడలింపు ఉంటుంది. ఈ నోటిఫికేషన్‌లో భాగంగా హైదరాబాద్ సర్కిల్ (తెలంగాణ) పరిధిలో 260 పోస్టులను కేటాయించారు. జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు దరఖాస్తు రుసుము రూ.750 కాగా, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు ఫీజు నుంచి మినహాయింపు ఇచ్చారు. తెలుగు రాష్ట్రాల్లోని అనంతపురం, గుంటూరు/విజయవాడ, కడప, కాకినాడ, కర్నూలు, నెల్లూరు, రాజమహేంద్రవరం, తిరుపతి, విశాఖపట్నం, విజయనగరం, చీరాల, హైదరాబాద్, కరీంనగర్, ఖమ్మం, వరంగల్ నగరాల్లో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. అభ్యర్థులను మూడు దశల్లో ఎంపిక చేస్తారు. తొలుత ఆన్‌లైన్ ప్రిలిమినరీ పరీక్ష (సెప్టెంబర్ 26, 27, అక్టోబర్ 3 తేదీల్లో), అనంతరం మెయిన్స్ పరీక్ష (నవంబర్‌లో) నిర్వహిస్తారు. తుది దశలో స్థానిక భాషా ప్రావీణ్యతను పరీక్షిస్తారు. అభ్యర్థులు ఏదైనా ఒక రాష్ట్రంలోని ఖాళీలకు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని, ఆ రాష్ట్ర స్థానిక భాషలో నైపుణ్యం కలిగి ఉండటం తప్పనిసరి అని ఎస్బీఐ స్పష్టం చేసింది. పూర్తి వివరాల కోసం అభ్యర్థులు అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించాల్సిందిగా సూచించింది.

# ఆనం అంటేనే అవినీతి

**వైసీపీ నేత, మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి**



**ఆత్మకూరు, ఆగస్టు 11, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆత్మకూరు నియోజకవర్గంలో మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని ప్రశ్నించడమే పెద్ద పాపమన్నట్లుగా అధికారులు, పోలీసులు వ్యవహరిస్తున్నారని వైసీపీ నేత, మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. నియోజకవర్గంలో మేకపాటి కుటుంబానికి ప్రజల గుండెల్లో సుస్థిర స్థానం ఉందని, తమ అభిమానులను, సానుభూతిపరులను ఉద్దేశించి మంత్రి నీచమైన వ్యాఖ్యలు చేయడం తగదని హితవు పలికారు. ఆనం గెలిచినప్పటి నుంచి ఆత్మకూరులో ఇసుక దందా, చికెన్ వేస్ట్ మాఫియాలు విచ్చలవిడిగా రాజ్యమేలుతున్నాయని, మర్రిపాడులో ఇసుక కొండనే మాయం చేశారని విక్రమ్‌రెడ్డి ఆరోపించారు. మంత్రి ధనదాహానికి ఏడుగురు బలికావడమే కాకుండా, చివరకు పోలీస్ స్టేషన్ల నుంచే మామూళ్లు వసూలు చేసే నీచ సంస్కృతికి తెరతీశారని దుయ్యబట్టారు. ఐదేళ్లకోసారి పార్టీలు మారే ఊసరవెల్లి నైజం ఆనందేనని, జగన్‌ను తిట్టి మంత్రి పదవి తెచ్చుకున్న చరిత్రహీనుడని ఎద్దేవా చేశారు. కేవలం ఇసుక దందా ద్వారానే నెలకు రూ.3 కోట్లు ఆర్జిస్తున్నారని విమర్శిస్తూ.. "ఆనం అంటే అవినీతి, అవినీతి అంటే ఆనం" అని అభివర్ణించారు. తనపై చేసిన ఆరోపణలను నిరూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకోవడానికైనా, రాజీనామా చేయడానికైనా సిద్ధమని, ఈ సవాల్‌ను స్వీకరించే దమ్ము ఆనంకు ఉందా అని నిలదీశారు.

# స్కూల్‌కు వెళ్తూ వాగులో కొట్టుకుపోయిన ఉపాధ్యాయురాలు

**కర్లపాద గ్రామంలో భయానక ఘటన - వాగును దాటుతున్న సమయంలో పెరిగిన వరద**
**చెట్టు కొమ్మను పట్టుకుని ప్రాణాలు దక్కించుకున్న ఉపాధ్యాయురాలు**



**కర్లపాద, ఆగస్టు 11, విశ్వం వాయిస్ న్యూస్ :** విధి నిర్వహణ కోసం బయలుదేరిన ఒక ఉపాధ్యాయురాలిని ఆకస్మికంగా వచ్చిన వరద ఉధృతి ముంచెత్తింది. ఏపీలోని అల్లూరి సీతారామరాజు జిల్లా కర్లపాద గ్రామం వద్ద ఈ భయంకర ఘటన చోటుచేసుకుంది. స్థానిక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా విధులను నిర్వర్తిస్తున్న ఎం.మణి ఎప్పటిలాగే స్కూలుకు వెళ్లేందుకు బయలుదేరగా, మార్గమధ్యంలో ఉన్న వాగును దాటే క్రమంలో ఒక్కసారిగా పెరిగిన వరద ప్రవాహంలో కొట్టుకుపోయారు. భారీ ప్రవాహంలో కొంతదూరం కొట్టుకుపోయిన ఆమె, ఒక చెట్టు కొమ్మను పట్టుకుని ప్రాణాలు దక్కించుకునే ప్రయత్నం చేస్తూ బిగ్గరగా కేకలు వేశారు. ఆ కేకలు విన్న గ్రామస్థులు తక్షణమే స్పందించి, ప్రాణాలకు తెగించి ఆమె వద్దకు చేరుకుని సురక్షితంగా బయటకు తీశారు. అనంతరం హుటాహుటిన సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు, గ్రామస్థులు తెలిపారు. ఏటా వర్షాకాలంలో ఈ వాగు పొంగిపొర్లుతూ ప్రాణాలమీదికి తెస్తోందని, ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఆ వాగుపై వెంటనే బ్రిడ్జి నిర్మించాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# సిరియా మాజీ అధ్యక్షుడు బషర్ అల్ అసద్‌కు మరణశిక్ష



**ఆగస్టు 11, విశ్వం వాయిస్ న్యూస్ :** సిరియా మాజీ అధ్యక్షుడు బషర్ అల్ అసద్‌తోపాటు ఆయన సోదరుడు మాహెర్ అల్ అసద్‌కు స్థానిక కోర్టు మరణశిక్ష విధించింది. సిరియాలో 14 ఏళ్ల పాటు సాగిన అంతర్యుద్ధంలో మానవత్వానికి వ్యతిరేకంగా పాల్పడిన నేరాలు, యుద్ధ నేరాలకుగానూ ఈ శిక్ష విధించింది. దక్షిణ దారా ప్రావిన్స్‌లో అణచివేతకు పాల్పడినందుకు అసద్ బంధువు అతేఫ్ నజీబ్‌కు కూడా మరణ దండన విధించింది. తీర్పు సమయంలో నజీబ్ ఒక్కరే న్యాయస్థానంలో ఉన్నారు. 2024 డిసెంబర్‌లో తిరుగుబాటుదారులు సిరియా రాజధాని డమాస్కస్‌ను ఆక్రమించుకోవడంతో.. అసద్‌తోపాటు ఆయన సోదరుడు మాహెర్ రష్యాకు పారిపోయారు. నజీబ్‌ను స్థానిక అధికారులు అదుపులోకి తీసుకున్నారు. సైన్యంలో బ్రిగేడియర్ జనరల్‌గా పనిచేసిన నజీబ్.. దారా ప్రావిన్స్‌లో రాజకీయ భద్రతా విభాగానికి అధిపతిగా ఉన్నారు. మాహెర్ సైతం సైన్యంలో పనిచేశారు. సిరియన్ అబ్జర్వేటరీ ఆఫ్ హ్యూమన్ రైట్స్ నివేదిక ప్రకారం.. సిరియా అంతర్యుద్ధంలో దాదాపు ఐదు లక్షల మందికి పైగా ప్రజలు మృతి చెందారు.

# ఎడిటర్ వాయిస్

## వైసీపీ ప్రోగ్రాం సక్సెస్.. కానీ వాళ్ళు రాలేదు!

ప్రకాశం జిల్లాలో ఇంచార్జిలు క్యాడర్ ని పెద్ద ఎత్తున తీసుకుని రాలేకపోయారు. ఈ జిల్లాలో క్యాడర్ అయితే అంత దూకుడుగా లేదా అన్నది చర్చగా ఉంది. వైసీపీ గత రెండేళ్ళలో ఎన్నడూ లేని విధంగా జనం బాట పట్టింది. ఆందోళనలకు పిలుపు ఇచ్చింది. నిరసనలు పెద్ద ఎత్తున నిర్వహిస్తోంది. ఒక విధంగా చెప్పాలీ అంటే వైసీపీ ఒక ఇష్యూని పట్టుకుని ఇంత సుదీర్ఘంగా ఆందోళన చేసిన దాఖలాలు అయితే గతంలో లేవు. కానీ మెగా డీఎస్సీ విషయంలో వైసీపీ దూకుడు చేస్తోంది. అక్రమాలు జరిగాయని అంటూ ఏకంగా టీడీపీ కూటమిలో అతి ముఖ్య నాయకుడు, విద్యా శాఖ మంత్రి అయిన నారా లోకేష్ మీద ఫుల్ ఫోకస్ పెట్టేసింది. ఒక విధంగా చెప్పాలీ అంటే గట్టిగానే టార్గెట్ చేసింది. దాంతో ఏపీలో పది రోజులుగా వైసీపీ నిరసన కార్యక్రమాలు సాగుతున్నాయి. ఈ నేపథ్యంలో వాటి ప్రభావం ఎలా ఉంది, జనాల నుంచి రెస్పాన్స్ ఎలా ఉంది అన్నది కనుక చూస్తే వైసీపీ ప్రోగ్రాం సక్సెస్ అని అంటున్నారు. కానీ అని అక్కడే ఆగిపోతున్నారు.

**వైసీపీకి ఇదే ఫస్ట్ టైం :** ఇక వైసీపీ 2024 తరువాత ఘోరంగా ఓటమి చెంది 11 సీట్లకే పరిమితం అయిన తరువాత గడచిన రెండేళ్ళ కాలంలో చేపట్టిన అనేక ఆందోళనలు నిరసనలతో పోలిస్తే మెగా డీఎస్సీ మీద ఆ పార్టీ చేపట్టిన పోరాటం మాత్రం హైలెట్ అని చెప్పాల్సి ఉంటుంది. రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన ఈ ప్రోగ్రాం బాగానే సాగింది. ఒక్క ప్రకాశం జిల్లాలో తప్పించి అన్ని చోట్ల సక్సెస్ అయింది అని అంటున్నారు. మరి ఇంతలా అన్ని చోట్ల వైసీపీ ప్రోగ్రాం సక్సెస్ అయితే ఒక్క ఆ జిల్లాలోనే ఎందుకు అలా అన్నదే ఇపుడు చర్చగా ఉంది.

**ప్రకాశంలో ఎందుకంటే :** ప్రకాశం జిల్లాలో ఇంచార్జిలు క్యాడర్ ని పెద్ద ఎత్తున తీసుకుని రాలేకపోయారు. ఈ జిల్లాలో క్యాడర్ అయితే అంత దూకుడుగా లేదా అన్నది చర్చగా ఉంది. అలాగే ఇంచార్జిలే తమ జోరుని చూపించలేకపోయారా అన్న ప్రశ్నలు కూడా వస్తున్నాయి. ఇంకో వైపు చూస్తే వైసీపీ రాష్ట్రవ్యాప్త ఆందోళనలకు జనాలు అన్ని చోట్ల పోటెత్తారు. అలాగే చాలా కాలం తరువాత వైసీపీ క్యాడర్ లో ఉత్సాహం కనిపించింది. అలాగే వైసీపీ నాయకులు కూడా అంతా కలసి హుషార్ గా పాల్గొనడం కూడా జరిగింది. అదే సమయంలో మెగా డీఎస్సీలో అక్రమాలు జరిగాయని చెబుతున్న అభ్యర్థులు కానీ నిరుద్యోగులు కానీ యువత కానీ ఈ మొత్తం ఆందోళనలో ఎక్కడా కనిపించకపోవడమే ఒక లోటుగా చెబుతున్నారు.

**అదే కారణమా అంటూ :** మరి వారు ఎందుకు పాల్గొనలేదు అంటే దానికి రీజనబుల్ గా వచ్చే సమాధానం కూడా ఉంది. తాము వచ్చి వైసీపీ చేసే ఆందోళనలలో పాలుపంచుకుంటే కెమెరాలకు చిక్కితే తమ భవిష్యత్తు ఎక్కడ ఇబ్బంది పడుతుందో అన్న ఆలోచనతోనే వారు వెనక్కి ఉండిపోయారు అని అంటున్నారు. ఒక రాజకీయ పార్టీ చేపట్టే ఆందోళనలో పాలు పంచుకుంటే తమకు మళ్ళీ జాబ్స్ రావు అన్న బెంగ కూడా వారికి ఉండడం వల్లనే ఎక్కడా కనిపించకుండా తెర వెనక్కే ఉండిపోయారు అని అంటున్నారు. అయితే ఎవరి కోసం ఈ కార్యక్రమం వైసీపీ చేసిందో వారు కానీ యువత కానీ కనిపించకపోవడం మాత్రం ఆ పార్టీకి మైనస్ గానే మారింది అని అంటున్నారు. దీంతో వైసీపీ నిరసనలకు జనాల నుంచి మంచి స్పందన వచ్చినా కూడా అసలైన వారు డీఎస్సీ రాసిన అభ్యర్థులు ఎక్కడా కనిపించకపోవడంతో ఆపరేషన్ సక్సెస్ పేషెంట్ డైడ్ అన్నట్లుగా వైసీపీ ప్రోగ్రాం తయారైంది అని అంటున్నారు. ఏది ఏమైనా వైసీపీ వరకూ చూస్తే మాత్రం ఈ నిరసనలు హిట్ అయి మంచి బూస్ట్ ఇచ్చాయనే అంటున్నారు.



ఎడిటర్ : కె.సునీల్‌కుమార్




## యువతి మృతి కేసులో కీలక పరిణామం..

### హత్య చేశారంటూ తల్లి ఫిర్యాదు

**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** నగరంలో శాంతినగర్‌కు చెందిన యువతి మధుప్రసన్న మృతి కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. తమ కుమార్తెను దారుణంగా హత్య చేశారని ఆమె తల్లి జ్యోతి మూడో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కోటిలింగాలపేటకు చెందిన అభిలాష్ సర్జికల్ బ్లేడుతో దాడి చేసి చంపాడని అందులో పేర్కొన్నారు. “మధుప్రసన్నకి జూన్ 21న మరో యువకుడితో నిశ్చితార్థం చేశాం. ఈనెల 27న వివాహం జరగాల్సి ఉంది. తననే పెళ్లి చేసుకోవాలని కొన్ని రోజులుగా అభిలాష్ వెంటపడుతున్నాడు. పెద్దలు కుదిర్చిన పెళ్లి చేసుకుంటానని మధుప్రసన్న చెప్పడంతో కోపం పెంచుకున్నాడు. మాట్లాడుకుందామని మభ్యపెట్టి బైక్‌పై గామన్ బ్రిడ్జి వద్దకు తీసుకెళ్లాడు. అక్కడ బ్లేడుతో దాడి చేశాడు. మధుప్రసన్న తప్పించుకునే ప్రయత్నం చేసే క్రమంలోనే యువకుడి చేతిపై గాయమైనట్లు అనుమానముంది. తమ కుమార్తెను దారుణంగా చంపిన అభిలాష్‌ను కఠినంగా శిక్షించాలి” అని జ్యోతి తన ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో పోలీసులు యువకుడిపై హత్య కేసు నమోదు చేశారు. రాజమహేంద్రవరం జీజీహెచ్‌లో పోస్టుమార్టం అనంతరం యువతి మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. కేసుపై పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## జలుబు అని ఆర్ఎంపీ దగ్గరికెళితే.. పాప ప్రాణమే పోయింది



**కొణిజర్ల, విశ్వం వాయిస్ న్యూస్ :** బోనాల పండగ సందర్భంగా హాస్టల్ నుంచి ఇంటికి వచ్చిన ఓ బాలిక కుటుంబ సభ్యులతో ఆనందంగా గడిపింది. ఆపై చిన్నపాటి అనారోగ్యానికి గురై... వైద్యం కోసం ఆర్ఎంపీ వద్దకు వెళ్తే అతడి నిర్లక్ష్యంతో ఏకంగా ప్రాణాలే కోల్పోయిన విషాదకర ఘటన ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం బస్వాపురంలో సోమవారం చోటుచేసుకుంది. ఎస్సై సూరజ్, బాధిత కుటుంబసభ్యుల కథనం మేరకు... బస్వాపురానికి చెందిన చల్లా రమేశ్, మౌనికల కుమార్తె హేమశ్రీ(14) స్థానిక కస్తూర్బా విద్యాలయంలో ఎనిమిదో తరగతి చదువుతోంది. బోనాల సందర్భంగా ఇంటికి వచ్చిన బాలిక జాతరలో ఉత్సాహంగా గడిపింది. ఆదివారం జలుబు, దగ్గుతో స్వల్ప అనారోగ్యానికి గురవడంతో మళ్లీ పాఠశాలకు పంపించాలంటే ఇబ్బందవుతుందని భావించిన తల్లిదండ్రులు స్థానిక ఆర్ఎంపీ వద్దకు తీసుకెళ్లారు. అతడు ఓ ఇంజక్షన్ ఇచ్చి, మరొకటి ఇస్తుండగానే హేమశ్రీకి స్పృహతప్పి నోటి నుంచి నురగ వచ్చింది. కళ్ల ముందే బిడ్డ ఊపిరాడక కొట్టుమిట్టాడుతుండటంతో కంగారుపడిన కుటుంబసభ్యులు వెంటనే ఖమ్మంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆమె మృతిచెందినట్లు తెలిపారు. నా బిడ్డకు సాధారణ జలుబు, దగ్గు అని వస్తే ప్రాణాలు తీశారంటూ తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు. బంధువులు ఆసుపత్రి వద్ద ఆదివారం రాత్రి ఆందోళన చేశారు. గంటపాటు ఏం వైద్యం చేశారంటూ ఆసుపత్రి సిబ్బందిని నిలదీశారు. పోలీసులు జోక్యం చేసుకుని నిర్వాహకులతో చర్చించగా ఆసుపత్రికి వచ్చేసరికే మృతిచెందినట్లు చెప్పారు. అక్కడున్న సీసీ కెమెరాల ఫుటేజీ, ఇతర వివరాలు పరిశీలించిన అనంతరం ఎస్సై సూరజ్ జోక్యం చేసుకొని బాలిక కుటుంబసభ్యులకు నచ్చజెప్పి, మృతదేహాన్ని ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆర్ఎంపీ గుర్తుతెలియని ఇంజక్షన్ ఇవ్వడం వల్లే తన కుమార్తె చనిపోయిందని పేర్కొంటూ మృతురాలి తండ్రి రమేశ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, ఖమ్మం ఆసుపత్రికి హేమశ్రీ తల్లిదండ్రులతోపాటు వచ్చిన గ్రామీణ వైద్యుడు చిన్నారి మృతిచెందినట్లు తెలిశాక పరారయ్యాడని ఎస్సై తెలిపారు.

## సంగారెడ్డి జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం..

### ఏడుగురి దుర్మరణం

**సత్వార్, విశ్వం వాయిస్ న్యూస్ :** సంగారెడ్డి జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. జహీరాబాద్ మండలం సత్వార్ వద్ద ఆటోను ట్యాంకర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఏడుగురు దుర్మరణం పాలవగా.. మరో ఐదుగురికి తీవ్రగాయాలయ్యాయి. వీరంతా కర్ణాటకలోని బీదర్ జిల్లా రాజగిరికి చెందిన వ్యవసాయ కూలీలుగా గుర్తించారు. క్షతగాత్రులను జహీరాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. సంగారెడ్డి జిల్లాలోనే జరిగిన మరో రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. కోహీర్ మండలం వెంకటాపూర్ కూడలి సమీపంలో 65వ నంబరు జాతీయ రహదారిపై ఓ కారు రోడ్డు డివైడర్ పైనుంచి అవతల వైపు ఎగిరి పడింది. ఈ ఘటనలో ఇద్దరు ప్రాణాలు కోల్పోగా.. నాలుగు వాహనాలు ధ్వంసమయ్యాయి. పోలీసులు ఘటనాస్థలికి చేరుకొని దర్యాప్తు చేపట్టారు.

### శంషాబాద్ ఎయిర్‌పోర్టులో

## భారీగా వెండి నాణేలు పట్టివేత



**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** శంషాబాద్ విమానాశ్రయంలో ఓ ప్రయాణికుడి వద్ద భారీగా వెండి నాణేలు పట్టుబడ్డాయి. ఎయిర్‌పోర్టులోని చెకింగ్ పాయింట్ వద్ద ఓ వ్యక్తిని అనుమానాస్పదంగా గుర్తించిన సీఐఎస్ఎఫ్ భద్రతా సిబ్బంది తనిఖీ చేశారు. అతని వద్ద 7 కిలోల వెండి నాణేలు ఉన్నట్టు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. దిల్లీ వెళ్లేందుకు వచ్చిన ఆ ప్రయాణికుడిని అదుపులోకి తీసుకున్నారు. వెండి నాణేలకు సబంధించిన బిల్లులు, పత్రాలపై ఆరా తీస్తున్నారు. వెండి ఎక్కడి నుంచి తీసుకొచ్చారు? ఎక్కడికి తరలిస్తున్నారు? అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.

## జీడిమెట్ల ఆర్టీసీ డిపోలో ప్రమాదం.. ఉద్యోగి మృతి



**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** మేడ్చల్ జిల్లా జీడిమెట్ల ఆర్టీసీ బస్సు డిపోలో జరిగిన ప్రమాదంలో ఓ ఉద్యోగి ప్రాణాలు కోల్పోయారు. మెకానిక్ బ్రేక్ చెక్ చేస్తుండగా డ్రైవర్ బస్సును ముందుకు నడపడంతో ప్రమాదం జరిగింది. ఇవాళ ఉదయం డిపోలో ఓ బస్సు.. బ్రేక్ సమస్య రావడంతో మెకానిక్ సంతోష్ కుమార్ (39) మరమ్మతులు చేస్తున్నారు. బస్సు కింద నుంచి పక్కకు రాకముందే డ్రైవర్ బస్సును ముందుకు తీసుకెళ్లడంతో మెకానిక్ అక్కడికక్కడే మృతి చెందారు. ఘటనపై జీడిమెట్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.








# ఎడిటర్స్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక

- అధ్యక్షుడిగా వీరభద్రరాజు, కార్యదర్శిగా పుర్రె త్రినాథ్, జాయింట్ సెక్రటరీగా ఖండవెల్లి సునీల్ కుమార్
- ప్రింట్ మీడియా పరిరక్షణకు సమష్టిగా ముందుకు సాగాలని తీర్మానం



**కాకినాడ గ్రామీణం, ఆగస్టు 11, విశ్వం వాయిస్ ప్రతినిధి :** ప్రింట్ మీడియా రంగం ఎదుర్కొంటున్న సవాళ్లను సమష్టిగా ఎదుర్కొంటూ, పత్రికల సంపాదకుల హక్కులు, సంక్షేమం, వృత్తిపరమైన ప్రయోజనాల పరిరక్షణకు మరింత సంఘటితంగా ముందుకు సాగాలని ఎడిటర్స్ అసోసియేషన్ సభ్యులు పిలుపునిచ్చారు. కాకినాడ రూరల్ మండల కార్యాలయంలో మంగళవారం ఎడిటర్స్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అసోసియేషన్ ఏర్పడి నాలుగు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఇప్పటివరకు చేపట్టిన కార్యక్రమాలు, భవిష్యత్ కార్యాచరణ, సంఘం బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై సభ్యులు విస్తృతంగా చర్చించారు. అనంతరం అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా పలువురు ఎడిటర్లు మాట్లాడుతూ ఆధునిక సాంకేతిక పరిణామాలు, పెరుగుతున్న ముద్రణ వ్యయం, పంపిణీ ఖర్చులు, ప్రకటనల ఆదాయం తగ్గుదల తదితర కారణాలతో ప్రస్తుతం ప్రింట్ మీడియా మనుగడ సవాలుగా మారిందన్నారు. ఆర్థిక భారాలను అధిగమిస్తూ పత్రికలను కొనసాగించడం చిన్న, మధ్య తరహా పత్రికల నిర్వాహకులకు కష్టసాధ్యంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో ఎడిటర్లందరూ పరస్పర సహకారంతో ఒకరికొకరు అండగా నిలవాలని పేర్కొన్నారు. వ్యక్తిగత ప్రయోజనాలు, స్వలాభాలకు అతీతంగా అన్ని పత్రికల అభివృద్ధి, సంపాదకుల సంక్షేమం లక్ష్యంగా అసోసియేషన్ పనిచేయాలని సూచించారు.

**అసోసియేషన్‌కు ప్రజల్లో ప్రత్యేక గుర్తింపు తీసుకురావాలి**

ఎడిటర్స్ అసోసియేషన్ కార్యకలాపాలను మరింత విస్తరించి ప్రజల్లో ప్రత్యేక గుర్తింపు తీసుకురావాలని సమావేశంలో నిర్ణయించారు. నూతన కార్యవర్గంతో పాటు ప్రతి సభ్యుడు సంఘం అభివృద్ధిలో భాగస్వామి కావాలని కోరారు. నూతన కమిటీ బాధ్యతలు స్వీకరించిన తొలి నెలలోనే వివిధ రంగాలకు చెందిన కనీసం ఐదుగురు ప్రముఖులను కలిసి, ఎడిటర్స్ అసోసియేషన్ లక్ష్యాలు, సమస్యలు, భవిష్యత్ కార్యాచరణకు సంబంధించిన సమగ్ర ప్రణాళికను వారి దృష్టికి తీసుకెళ్లాలని నిర్ణయించారు. అసోసియేషన్‌లో సభ్యత్వం కలిగిన ప్రతి సంపాదకుడికి ఉపయోగపడే విధంగా కార్యక్రమాలు రూపొందించాలని, ఎడిటర్లకు ఎదురయ్యే వృత్తిపరమైన, న్యాయపరమైన సమస్యల పరిష్కారానికి సంఘం అండగా నిలవాలని సభ్యులు అభిప్రాయపడ్డారు. ప్రభుత్వాలు, ప్రజాప్రతినిధులు, అధికార యంత్రాంగం వద్ద ఎడిటర్ల సమస్యలను సమష్టిగా ప్రస్తావించే బలమైన వేదికగా అసోసియేషన్‌ను తీర్చిదిద్దాలని సూచించారు.

**నూతన కార్యవర్గం ఇదే**

ఎడిటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా వీరభద్రరాజు, కార్యదర్శిగా పుర్రె త్రినాథ్, కోశాధికారిగా దొరబాబు ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా దాసరి శ్రీనివాస్, ఎం.టి. విక్టర్, జాయింట్ సెక్రటరీలుగా ఖండవెల్లి సునీల్ కుమార్, బషీర్ అలీ ఎన్నికయ్యారు. గౌరవ అధ్యక్షుడిగా కోనేటి శ్రీనివాస్, గౌరవ సలహాదారుడిగా వి.వి.ఎస్. ప్రకాష్, న్యాయ సలహాదారుడిగా పితాని రాము బాధ్యతలు చేపట్టనున్నారు. కార్యవర్గ సభ్యులుగా గునిపే శోభన్, ఎం.ఎస్. వాసు, సత్యనారాయణ (నాని), గరగ ప్రసాద్, రమణ కుమార్ ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులకు సమావేశంలో పాల్గొన్న ఎడిటర్లు అభినందనలు, శుభాకాంక్షలు తెలియజేశారు. రానున్న రోజుల్లో ఎడిటర్స్ అసోసియేషన్‌ను మరింత బలోపేతం చేస్తూ, సంపాదకుల సమస్యల పరిష్కారం, పత్రికా రంగ అభివృద్ధి, జర్నలిజం విలువల పరిరక్షణ కోసం ఐక్యంగా పనిచేయాలని నూతన కార్యవర్గం సంకల్పం వ్యక్తం చేసింది.

# '102' తల్లి-బిడ్డ వాహనాలతో గర్భిణులకు రవాణా భరోసా

**మాతా-శిశు ఆరోగ్య రక్షణే లక్ష్యం - కాకినాడ జిల్లాకు కొత్తగా 18 తల్లి-బిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలు**

**ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో వాహనాలను ప్రారంభించిన కలెక్టర్, ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు**



**కాకినాడ, ఆగస్టు 11, విశ్వం వాయిస్ న్యూస్ :** గర్భిణులకు రవాణా సమస్యలను దూరం చేయడంతో పాటు మాతా-శిశు మరణాలను తగ్గించడమే లక్ష్యంగా కాకినాడ జిల్లా వ్యాప్తంగా 18 నూతన '102' తల్లి-బిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కాకినాడ జిల్లా వైద్య ఆరోగ్యశాఖకు కేటాయించిన నూతన '102' తల్లి-బిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలను మంగళవారం కాకినాడ ప్రభుత్వ జిల్లా ఆస్పత్రి ప్రాంగణంలో కలెక్టర్ హరేంధిర ప్రసాద్, కాకినాడ పట్టణ ఎమ్మెల్యే లివనమాడి వెంకటేశ్వరరావు (కొండబాబు)లతో కలిసి లాంఛనంగా ప్రారంభించారు.

**గర్భిణుల ఇంటి వద్దకే రవాణా సేవలు**

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి ప్రత్యేక చొరవతో మాతా-శిశు ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందన్నారు. జిల్లాలోని అన్ని ప్రాంతాలకు సేవలు అందే విధంగా మొత్తం 18 కొత్త వాహనాలను కేటాయించినట్లు వెల్లడించారు. గర్భిణులు ఎటువంటి రవాణా ఇబ్బందులు ఎదుర్కోకుండా తమ ఇళ్ల నుంచి ప్రభుత్వ ఆస్పత్రులకు చేరుకోవడంతో పాటు ప్రసవానంతరం తల్లి, శిశువును తిరిగి సురక్షితంగా ఇంటికి చేర్చేందుకు ఈ వాహనాలు ఉపయోగపడతాయని వివరించారు. మాతా, శిశు మరణాలను సాధ్యమైనంత వరకు పూర్తిగా నివారించే లక్ష్యంతో ప్రభుత్వం ఈ సేవలను మరింత బలోపేతం చేస్తోందన్నారు.

**అధిక ప్రమాద గర్భిణులకు ప్రత్యేక ప్రయోజనం**

'102' తల్లి-బిడ్డ ఎక్స్‌ప్రెస్ సేవలు అవసరమైన గర్భిణులు తమ పరిధిలోని ఏఎన్ఎంలు, కమ్యూనిటీ ఆరోగ్య అధికారులతో పాటు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారుల ద్వారా ముందుగా వాహనాన్ని పొందవచ్చని కలెక్టర్ తెలిపారు. ముఖ్యంగా అధిక ప్రమాద గర్భధారణ ఉన్న మహిళలు ఈ సేవలను తప్పనిసరిగా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గర్భధారణ సమయంలో అవసరమైన సాధారణ వైద్య పరీక్షలకు ఆస్పత్రులకు వెళ్లేందుకు కూడా ఈ వాహనాలను వినియోగించుకునే అవకాశం ఉంటుందన్నారు. ప్రజలకు ఈ వాహనాలు నిరంతరం అందుబాటులో ఉండేలా జిల్లా యంత్రాంగం అవసరమైన చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఈ సేవలను జిల్లాకు అందుబాటులోకి తీసుకొచ్చినందుకు ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, వైద్య ఆరోగ్యశాఖ మంత్రికి జిల్లా ప్రజల తరఫున కలెక్టర్ కృతజ్ఞతలు తెలిపారు.

**ప్రజారోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట : ఎమ్మెల్యే కొండబాబు**

కాకినాడ పట్టణ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం ప్రజారోగ్య రంగానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తోందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 500 తల్లి-బిడ్డ ఎక్స్‌ప్రెస్ '102' వాహనాలను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. కాకినాడ జిల్లాకు తొలి విడతగా కేటాయించిన 18 వాహనాల్లో 7 వాహనాలను కలెక్టర్, వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో కలిసి ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. గర్భిణులను సురక్షితంగా ఆస్పత్రులకు చేర్చడం, ప్రసవం అనంతరం తల్లి, బిడ్డను ఇంటికి చేర్చడంలో ఈ సేవలు ఎంతగానో ఉపయోగపడతాయని చెప్పారు.

**ఆధునిక భద్రతా సదుపాయాలు**

అత్యవసర సమయాల్లోనూ, సరైన రవాణా సౌకర్యాలు అందుబాటులో లేని ప్రాంతాల్లోనూ తల్లి-బిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని ఎమ్మెల్యే తెలిపారు. నూతన సాంకేతికతతో రూపొందించిన ఈ వాహనాల్లో ఆరు గాలి సంచులు (ఎయిర్‌బ్యాగులు), అత్యవసర పరిస్థితుల్లో సహాయం కోసం ప్రత్యేక బటన్ తదితర భద్రతా సదుపాయాలు ఏర్పాటు చేసినట్లు వివరించారు. జిల్లాలోని గర్భిణులు, బాలింతలు ఈ సేవలను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కొండబాబు కోరారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె.అనిత, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్య కుమారి, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాసన్, సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ మెహర్తో పాటు వైద్యులు, వైద్య సిబ్బంది, ఇతర అధికారులు పాల్గొన్నారు.

నంబర్ ప్లేట్లు.. హెల్మెట్‌పై

# పోలీసుల ప్రత్యేక తనిఖీలు

**నిబంధనలు ఉల్లంఘిస్తే భారీ జరిమానాలు తప్పవని హెచ్చరిక**

**కాకినాడలో ట్రాఫిక్-1 పోలీసుల అవగాహన కార్యక్రమం**



**కాకినాడ, ఆగస్టు 11, విశ్వం వాయిస్ న్యూస్ :** వాహనాలకు నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన నంబర్ ప్లేట్లు, ద్విచక్ర వాహనదారుల హెల్మెట్ వినియోగంపై కాకినాడ ట్రాఫిక్-1 పోలీసులు మంగళవారం ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. ట్రాఫిక్ నిబంధనలపై వాహనదారులకు అవగాహన కల్పించారు. జిల్లా ఎస్పీ జి.బిందు మాధవ్ ఆదేశాల మేరకు అదనపు ఎస్పీ ఎం.కిషోర్ కుమార్ పర్యవేక్షణలో కాకినాడ నగరంలోని పలు ప్రాంతాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. మోటారు వాహనదారులు ప్రభుత్వం నిర్దేశించిన ప్రమాణాలకు అనుగుణంగా జారీ చేసిన నంబర్ ప్లేట్లను మాత్రమే ఉపయోగించాలని పోలీసులు సూచించారు. వాహనం ముందు, వెనుక భాగాల్లో నంబర్ ప్లేట్లు స్పష్టంగా కనిపించేలా ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. నంబర్ ప్లేట్‌పై ఉన్న అంకెలను మార్చడం, చెరిపివేయడం, వంకరగా అమర్చడం, ఇతరులకు కనిపించకుండా చేయడం వంటి చర్యలకు పాల్పడవద్దని హెచ్చరించారు. నంబర్ ప్లేట్లపై పేర్లు, చిత్రాలు, అలంకరణ గుర్తులు, స్టిక్కర్లు లేదా నిబంధనలకు విరుద్ధమైన ఆకృతులను ఏర్పాటు చేయరాదని స్పష్టం చేశారు. నంబర్ ప్లేట్‌ను ఉద్దేశపూర్వకంగా దాచడం లేదా మార్పులు చేయడం చట్టవిరుద్ధమని, ఇటువంటి వాహనాలపై కేసులు నమోదు చేయడంతో పాటు జరిమానాలు విధిస్తామని పోలీసులు హెచ్చరించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. వాహనం నడుపుతూ చరవాణిలో మాట్లాడటం ప్రమాదకరమని, ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా పాటించాలని తెలిపారు. మోటారు వాహన చట్టంలోని నిబంధనలను ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు భారీ జరిమానాలు విధించే అవకాశం ఉందని పోలీసులు వాహనదారులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్-1 ఇన్‌స్పెక్టర్ ఎన్. రమేష్, ఉప నిరీక్షకులు పి. కిశోర్ కుమార్, సి.హెచ్. కిషోర్ కుమార్, సి.హెచ్. బోసుబాబు, బి.వి. సత్యనారాయణతో పాటు ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

# మాడిఫైడ్ సైలెన్సర్లపై పోలీసుల ఉక్కుపాదం!

**రోడ్ రోలర్‌తో 540 సైలెన్సర్లు ధ్వంసం - రెండేళ్లలో 1,010 కేసులు.. రూ.14.82 లక్షల జరిమానాలు**

**మరోసారి పట్టుబడితే సైలెన్సర్‌తో పాటు వాహనం కూడా జప్తు: ఎస్పీ బిందు మాధవ్ హెచ్చరిక**



**కాకినాడ, ఆగస్టు 11, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ నగరంలో అధిక శబ్దంతో ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్న మాడిఫైడ్ సైలెన్సర్లపై జిల్లా పోలీసులు కఠిన చర్యలకు దిగారు. ప్రత్యేక తనిఖీల్లో వాహనాల నుంచి తొలగించి జప్తు చేసిన 540 మాడిఫైడ్ సైలెన్సర్లను మంగళవారం కాకినాడ ట్రాఫిక్-2 పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో రోడ్ రోలర్‌తో తొక్కించి ధ్వంసం చేశారు. కాకినాడ జిల్లా ఎస్పీ జి.బిందు మాధవ్, ఐపీఎస్ ఆదేశాల మేరకు, అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) డాక్టర్ మహంతి కిషోర్ కుమార్ పర్యవేక్షణలో ట్రాఫిక్ పోలీసులు 2025, 2026 సంవత్సరాల్లో నగరవ్యాప్తంగా మాడిఫైడ్ సైలెన్సర్లపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు.

**అధిక శబ్దానికి అడ్డుకట్ట**

వాహనాలకు నిబంధనలకు విరుద్ధంగా మార్పులు చేసిన సైలెన్సర్లను అమర్చడం వల్ల తీవ్రమైన శబ్ద కాలుష్యం ఏర్పడటంతో పాటు ఇతర వాహనదారులు, పాదచారులు, స్థానిక ప్రజలకు తీవ్ర అసౌకర్యం కలుగుతోందని పోలీసులు తెలిపారు. అధిక శబ్దం ప్రజల ప్రశాంతతకు భంగం కలిగించడంతో పాటు ఆరోగ్యంపై కూడా ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉన్నందున ఇటువంటి సైలెన్సర్ల వినియోగాన్ని నియంత్రించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. తనిఖీల సందర్భంగా మాడిఫైడ్ సైలెన్సర్లు అమర్చిన వాహనాలను గుర్తించి, సంబంధిత వాహనదారులపై మోటారు వాహనాల చట్టం ప్రకారం కేసులు నమోదు చేసి జరిమానాలు విధించారు. వాహనాల నుంచి తొలగించిన సుమారు 540 మాడిఫైడ్ సైలెన్సర్లను జప్తు చేశారు.

2026లో భారీగా కేసులు పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం..

2025 సంవత్సరంలో 169 కేసులు నమోదు చేసి రూ.2,20,500 అపరాధ రుసుము విధించారు.

2026 సంవత్సరంలో 841 కేసులు నమోదు చేసి రూ.12,61,605 జరిమానాలు విధించారు.


రెండు సంవత్సరాల్లో కలిపి 1,010 కేసులు నమోదు చేసి మొత్తం రూ.14,82,105 అపరాధ రుసుము విధించినట్లు పోలీసులు తెలిపారు.

**రోడ్ రోలర్‌తో ధ్వంసం**

వాహన తనిఖీల్లో స్వాధీనం చేసుకున్న 540 మాడిఫైడ్ సైలెన్సర్లను ఎస్పీ జి. బిందు మాధవ్ ఆదేశాల మేరకు మంగళవారం ఉదయం 10.40 గంటలకు కాకినాడ ట్రాఫిక్-2 పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో రోడ్ రోలర్‌తో తొక్కించి పూర్తిగా ధ్వంసం చేశారు. ఈ కార్యక్రమాన్ని ఎస్పీ బిందు మాధవ్ స్వయంగా పర్యవేక్షించారు.

**'రెండోసారి పట్టుబడితే వాహనం కూడా జప్తు'**

ప్రజలకు అసౌకర్యం కలిగిస్తూ అధిక శబ్ద కాలుష్యానికి కారణమయ్యే మాడిఫైడ్ సైలెన్సర్లను వాహనదారులు ఉపయోగించవద్దని ఎస్పీ జి.బిందు మాధవ్ సూచించారు. వాహనదారులు ట్రాఫిక్, మోటారు వాహన నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, ప్రజల ప్రశాంతతకు భంగం కలిగించే చర్యలకు దూరంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) డాక్టర్ మహంతి కిషోర్ కుమార్, అడిషనల్ ఎస్పీ (ఏఆర్) ఎస్. శ్రీనివాసరావు, ఎస్బీ డీఎస్పీ కె.వి.వి. సత్యనారాయణ, ట్రాఫిక్-1 ఇన్‌స్పెక్టర్ ఎన్. రమేష్, కాకినాడ రెండో పట్టణ ఇన్‌స్పెక్టర్ మజ్జి అప్పలనాయుడు, ట్రాఫిక్-2 ఎస్సై బి. రాజేష్ కుమార్, ఎస్సైలు ఎం.ఎస్.ఎన్. రాజు, ఏ. సత్యనారాయణ, పి. సత్యనారాయణతో పాటు ట్రాఫిక్-2 పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

### టిఎల్ఎం ఆసుపత్రిని వెంటనే తెరచి

# కుష్టు వ్యాధిగ్రస్తులకు వైద్యం అందించాలి

### కుష్టు వ్యాధిగ్రస్తుల సంక్షేమ సంఘం డిమాండ్




**రామచంద్రపురం, ఆగస్టు 11, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం నియోజకవర్గం కుష్టు వ్యాధిగ్రస్తుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గత 35 రోజుల నుండి కుష్టు రోగుల సమస్యలపై జిల్లా కలెక్టర్ వారికి అలాగే జిల్లా ఎస్పీ వారికి వినతి పత్రాలు అందజేశామని ఇప్పటివరకు మాకు ఎలాంటి న్యాయం జరగలేదు అని తెలియజేశారు. గత కొన్ని దశాబ్దాలుగా టిఎల్ఎం ఆసుపత్రిలో కుష్టు వ్యాధిగ్రస్తులకు ఉచితంగా వైద్యం అందించేవారు. కానీ గత కొన్ని సంవత్సరాలుగా ఆ ఆసుపత్రిని మూసివేయడంతో పాటు, అక్కడి 3.80 సెంట్ల భూమిని, ఆసుపత్రి భవనాన్ని కూడా అమ్మే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇటీవల టిఎల్ఎం అధికారులు 17-04-2026 న సాలూరులో 10 మంది కుష్టు రోగులతో సమావేశం ఏర్పాటు చేశారు. మా సమస్యలు విన్న అధికారులు మా డిమాండ్లు న్యాయమైనవే అని ఒక నెలలో శుభవార్త ఉంటుంది అని హామీ ఇచ్చారు. కానీ నేటికి 4 నెలలు గడుస్తున్నా ఎటువంటి చర్యలు లేవు. ప్రస్తుతం చాలామంది వైద్యం అందక కుష్టు రోగుల గాయాలు ముదిరిపోతున్నాయి. చాలా మంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలియజేశారు అడిగితే చూద్దాం చేద్దాం అని కాలయాపన చేస్తున్నారు. మా సమస్యలను పరిష్కరించాలని ఎంతోమంది అధికారులను కలిసి విన్నవించుకున్న రాజకీయ నాయకులకు తెలియజేసిన ఎప్పటి వరకు ఎవరు స్పందించలేదని ఈ సందర్భంగా తెలియజేశారు. మేము కోరుకునేది

1. టి ఎల్ ఎం ఆసుపత్రిని వెంటనే పునఃప్రారంభించాలని
2. కుష్టు వ్యాధిగ్రస్తులకు గతంలో లాగా ఉచిత వైద్యం, మందులు అందించాలని
3. ఆసుపత్రి భూమిని, ఆస్తులను అమ్మే ప్రయత్నాలను నిలిపివేయాలి

ప్రభుత్వం, ఉన్నతాధికారులు వెంటనే స్పందించి కుష్టు రోగుల ప్రాణాలు కాపాడాలని కోరుతున్నాము అని మాకు న్యాయం జరిగే వరకూ పోరాటం చేస్తామని ఈ సందర్భంగా తెలియజేశారు.

### వేగయమ్మపేట రైతు సేవా కేంద్రంలో

# రైతులకు శిక్షణ కార్యక్రమం



**రామచంద్రపురం, ఆగస్టు 11, విశ్వం వాయిస్ న్యూస్ :** రామచంద్రపురం మండలం వేగయమ్మపేట రైతు సేవా కేంద్రంలో ఆత్మ, వ్యవసాయ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో రైతులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సహాయ వ్యవసాయ సంచాలకులు అరుణ, మండల వ్యవసాయ అధికారి టి.వి.ఆర్. మణిదీప్, రైతు శిక్షణా కేంద్రం వ్యవసాయ అధికారి మనోహర్ హాజరై పలు కీలక సూచనలు చేశారు. భూసార పరీక్షల ఫలితాల ఆధారంగానే పొలాల్లో ఎరువులను వాడాలని, దీనివల్ల అనవసర పెట్టుబడి ఖర్చులు తగ్గుతాయని వివరించారు. ప్రకృతి వ్యవసాయం ప్రాముఖ్యతతో పాటు సూక్ష్మ పోషకాల వాడకం వల్ల పంట నాణ్యత పెరిగి మంచి ప్రయోజనాలు కలుగుతాయని తెలిపారు. నూతన విధానంలో భాగంగా ప్రత్యేక అనువర్తనం ద్వారా రైతులకు పారదర్శకంగా జరుగుతున్న ఎరువుల పంపిణీ ప్రక్రియను వివరించారు. ప్రస్తుత సాగు కాలానికి సంబంధించి విత్తనం నుండి విక్రయం వరకు రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వ్యవసాయ శాఖ ప్రతిక్షణం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. రైతులు పెట్టుబడి ఖర్చులను తగ్గించుకుంటూ ఆశించిన దిగుబడులు సాధించేలా ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ శిక్షణ కార్యక్రమంలో వేగయమ్మపేట గ్రామ రైతులు, వ్యవసాయ శాఖ సిబ్బంది, ఆత్మ సిబ్బంది పాల్గొన్నారు.

# చిన్నారి ఎదుగుదలకు 'ఏఐ' అండ!

### 'నవచేతన'తో అభివృద్ధి లోపాలకు తొలిదశలోనే చెక్ - పిల్లల శారీరక, మానసిక, భాషా నైపుణ్యాలపై డిజిటల్ స్క్రీనింగ్
### అంగన్‌వాడీల్లో ప్రతి చిన్నారి ఎదుగుదలపై నిరంతర పర్యవేక్షణ - జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్




**కాకినాడ, ఆగస్టు 11, విశ్వం వాయిస్ న్యూస్ :** చిన్నారుల భవిష్యత్తుకు అంగన్వాడీ కేంద్రాలే బలమైన పునాది కావాలని, వారి సమగ్ర అభివృద్ధిలో ఎదురయ్యే లోపాలను ప్రారంభ దశలోనే గుర్తించి పరిష్కరించేందుకు కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత స్క్రీనింగ్, 'నవచేతన' కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కాకినాడ కలెక్టరేట్ నుంచి జిల్లాలోని తొమ్మిది ఐసీడీఎస్ ప్రాజెక్టులకు చెందిన సీడీపీఓలతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. చిన్నారుల పోషణ, ఆరోగ్యం, ఎదుగుదల, ముందస్తు బాల్య విద్యతో పాటు 'నవచేతన' కార్యక్రమం అమలు తీరును ప్రాజెక్టుల వారీగా సమీక్షించారు.

**ప్రతి చిన్నారి ఎదుగుదలపై నిఘా**

ఆరు నెలల లోపు పిల్లలకు తల్లిపాలు అందించడం, ఒకటి నుంచి రెండేళ్ల పిల్లలకు అనుబంధ పోషకాహారం, టేక్ హోమ్ రేషన్ పంపిణీ, రెండు నుంచి మూడేళ్ల పిల్లల్లో ఎదుగుదల లోపాలను గుర్తించడం వంటి అంశాలపై కలెక్టర్ ప్రత్యేకంగా సమీక్షించారు. పిల్లల్లో అభివృద్ధి ఆలస్యాలు, వైకల్యాలను తొలిదశలోనే గుర్తించి తక్షణ సహాయక సేవలు అందించడమే 'నవచేతన' కార్యక్రమం ప్రధాన లక్ష్యమని తెలిపారు. కృత్రిమ మేధ ఆధారిత డిజిటల్ సాధనాల ద్వారా చిన్నారుల శారీరక ఎదుగుదల, మానసిక వికాసం, భాషా నైపుణ్యం, సామాజిక స్పందన, స్వయం సహాయక సామర్థ్యాలను అంచనా వేయాలని అధికారులకు సూచించారు.

**మాట.. కదలిక.. ప్రవర్తన అన్నీ నమోదు చేయాలి**

అంగన్వాడీ కేంద్రానికి వచ్చే ప్రతి చిన్నారి ప్రవర్తన, మాటతీరు, కదలికలు, స్పందనలో వచ్చే మార్పులను సిబ్బంది నిశితంగా పరిశీలించాలని కలెక్టర్ ఆదేశించారు. పిల్లల అభివృద్ధికి సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు నమోదు చేయడంతో పాటు సమస్యలు ఉన్నట్లు గుర్తించిన చిన్నారులను వెంటనే వైద్య నిపుణులకు పంపాలని చెప్పారు. అవసరాన్ని బట్టి చికిత్స, థెరపీ, ప్రత్యేక శిక్షణ అందేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. వచ్చే నెల సమీక్ష నాటికి అన్ని అంశాల్లో ఆశించిన పురోగతి కనిపించాలని, విధుల నిర్వహణలో అలసత్వం లేదా నిర్లక్ష్యం కనిపిస్తే క్రమశిక్షణ చర్యలు తప్పవని హెచ్చరించారు.

**ఆరేళ్లలోపే కీలకమైన మెదడు వికాసం**

చిన్నారుల్లో ఆరేళ్ల వయసులోపే సుమారు 85 శాతం మెదడు అభివృద్ధి జరుగుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ దశలో పౌష్టికాహారం, ఆరోగ్య సంరక్షణతో పాటు ముందస్తు బాల్య విద్య అత్యంత కీలకమన్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో ఆటపాటలు, కథలు, సృజనాత్మక కార్యక్రమాల ద్వారా చిన్నారుల్లో నేర్చుకునే ఆసక్తిని పెంపొందించాలని సూచించారు. చదువు పిల్లలకు భారంగా కాకుండా ఆనందకరమైన అనుభూతిగా ఉండేలా చూడాలన్నారు.

**పోషకాహార లోపానికి చోటుండకూడదు**

జిల్లాలోని ఏ ఒక్క అంగన్వాడీ కేంద్రం పరిధిలోనూ చిన్నారులు పోషకాహార లోపంతో బాధపడే పరిస్థితి ఉండకూడదని కలెక్టర్ స్పష్టం చేశారు. ఉమ్మడి కుటుంబ వ్యవస్థ క్రమంగా తగ్గుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో తల్లీబిడ్డల ఆరోగ్య సంరక్షణ బాధ్యతను ప్రభుత్వం మరింత విస్తృతంగా నిర్వహిస్తోందన్నారు. పిల్లల పరిశుభ్రత, పౌష్టికాహారం విషయంలో తల్లిదండ్రులు కూడా ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని కోరారు. క్షేత్రస్థాయి సందర్శనల సందర్భంగా అంగన్వాడీల్లో చిన్నారులకు అందించే ఆహార పదార్థాలను మరింత నాణ్యతతో తయారు చేయాలని అసిస్టెంట్ కలెక్టర్ కుమారి ప్రియా సూచించినట్లు తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అసిస్టెంట్ కలెక్టర్ కుమారి ప్రియా, ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ సీహెచ్ లక్ష్మి, సంబంధిత సీడీపీఓలు పాల్గొన్నారు.

**'నవచేతన' ఏం చేస్తుంది?**

చిన్నారుల్లో వయసుకు తగిన ఎదుగుదల జరుగుతోందా? మాట, కదలికలు, స్పందన, సామాజిక ప్రవర్తనలో ఏవైనా లోపాలున్నాయా? అనే అంశాలను ప్రారంభ దశలోనే గుర్తించడమే 'నవచేతన' ప్రధాన ఉద్దేశం. సమస్యలను ముందుగానే గుర్తించడం ద్వారా వైద్య సలహా, చికిత్స, థెరపీ, ప్రత్యేక శిక్షణ వంటి సేవలను త్వరగా అందించేందుకు అవకాశం ఉంటుంది.

### హసన్ బాద భీమేశ్వరస్వామి ఆలయంలో శాకాంబరీ దేవిగా

# మాణిక్యాంబ అమ్మవారికీ విశేష పూజలు



**హసన్‌బాధ, ఆగస్టు 11, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం మండలం హసన్ బాద గ్రామంలో వేంచేసియున్న శ్రీ మాణిక్యాంబ సమేత భీమేశ్వరస్వామి ఆలయంలో ఆషాఢ మాస శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని విశేష పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఉండి వీరభద్రశర్మ బ్రహ్మత్వంలో మాణిక్యాంబ అమ్మవారిని వివిధ రకాల కూరగాయలతో శాకాంబరీ దేవిగా అలంకరించి పూజలు, అభిషేకాలు జరిపారు. ఈ సందర్భంగా గ్రామ మహిళలు మేళతాళాల నడుమ ప్రదక్షిణగా తరలివచ్చి వివిధ రకాల తీపి పదార్థాలు, పండ్లు, పసుపు, కుంకుమ, పువ్వులతో అమ్మవారికి సారె సమర్పించారు. అనంతరం అమ్మవారికి కుంకుమార్చన, నీరాజన మంత్రపుష్పములు సమర్పించి, భక్తులకు ప్రసాద వితరణ చేశారు. సంగీత గాయకురాలు జయంతి సరోజ లలిత గీతాలాపన చేయగా, గ్రామ మహిళలు లలితా సహస్రనామ పారాయణం చేశారు. పూజా కార్యక్రమాల అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బిజెపి కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి, మాజీ సర్పంచ్ నాగిరెడ్డి సతీష్ రావు, చోడిశెట్టి వీరభద్రరావు, బొల్లం సత్తిరాజు, ఎరుబండి చినసత్యనారాయణ, చింతపల్లి రాంబాబు, ఇంటి వీరబాబు, దునే అర్జున, చాగంటి నరసింహమూర్తి, సతీష్, కాకిలేటి సత్యనారాయణ, కోరుకొండ వీరబాబు, సింగిరెడ్డి రామయ్య, కాల్దారి బ్రహ్మం, భలే బాబూరావు, కాసపు వీరబాబు, కాకిలేటి రాంబాబు, ఆలయ కమిటీ సభ్యులు మరియు గ్రామ భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### సామర్లకోటలో

# కోలాహలంగా చీర-సారె సమర్పణ

### బాలా త్రిపురసుందరి అమ్మవారికి భక్తిశ్రద్ధలతో సమర్పణ
### వందలాది మహిళా భక్తులతో వైభవంగా ఊరేగింపు



**సామర్లకోట, ఆగస్టు 11, విశ్వం వాయిస్ న్యూస్ :** సామర్లకోటలోని ప్రసిద్ధ శ్రీ బాలా త్రిపురసుందరి సమేత భీమేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం చీర-సారె సమర్పణ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో, కోలాహలంగా నిర్వహించారు. వందలాది మంది మహిళా భక్తులు పాల్గొనడంతో సామర్లకోట పట్టణంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. ఈ సందర్భంగా పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి బాబు ముందుగా సామర్లకోట స్టేషన్ సెంటర్‌లో కొలువై ఉన్న శ్రీ నూకాలమ్మ అమ్మవారి ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భీమేశ్వరస్వామి ఆలయ కార్యనిర్వహణాధికారి బళ్ల నీలకంఠం, ఆలయ చైర్మన్ కంటే జగదీష్ మోహన్ ఆధ్వర్యంలో చీర-సారె సమర్పణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. శ్రీ నూకాలమ్మ ఆలయం నుంచి భీమేశ్వరస్వామి ఆలయం వరకు చీర-సారెను మహిళా భక్తులు భక్తిపూర్వకంగా ఊరేగింపుగా తీసుకెళ్లారు. కోలాట బృందాల ప్రదర్శనలు, మంగళవాయిద్యాలు, భక్తుల నామస్మరణల నడుమ సాగిన ఈ ఊరేగింపు విశేషంగా ఆకట్టుకుంది. అనంతరం ఆలయానికి చేరుకున్న మహిళా భక్తులు బాలా త్రిపురసుందరి అమ్మవారికి చీర-సారెను సమర్పించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి కృపాకటాక్షాలు తమ కుటుంబాలపై ఉండాలని భక్తులు ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక ప్రముఖులు, మహిళా భక్తులు, పట్టణ ప్రజలు వందలాదిగా పాల్గొన్నారు.

### కాకినాడ జిల్లా ఆయుష్

# అధికారిణిగా డాక్టర్ టి.మహతి

### పదోన్నతిపై బాధ్యతలు స్వీకరణ..
### జిల్లా కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన వైద్యురాలు




**కాకినాడ, ఆగస్టు 11, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా ఆయుష్ అధికారిణిగా డాక్టర్ టి.మహతి, ఎం.డి. (ఆయుర్వేద) పదోన్నతిపై నియమితులయ్యారు. ఇప్పటివరకు శ్రీకాకుళం జిల్లా సింగుపురంలో మెడికల్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న డా. మహతి, స్త్రీ వ్యాధులు, ప్రసూతి వైద్య విభాగంలో వైద్య సేవలు అందిస్తున్నారు. తాజాగా ప్రభుత్వం ఆమెకు పదోన్నతి కల్పిస్తూ కాకినాడ జిల్లా ఆయుష్ అధికారిణిగా నియమించింది. ఈ నేపథ్యంలో మంగళవారం కాకినాడ కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్‌ను డాక్టర్ మహతి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తన నియామకానికి సంబంధించిన వివరాలను కలెక్టర్‌కు తెలియజేశారు. జిల్లాలో ఆయుష్ వైద్య సేవలను ప్రజలకు మరింత సమర్థవంతంగా అందుబాటులోకి తీసుకురావడంతో పాటు, ఆయుర్వేద వైద్య విధానంపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ సూచించినట్లు సమాచారం. జిల్లాలో ఆయుష్ వైద్య సేవల బలోపేతం, ప్రభుత్వ ఆయుష్ ఆసుపత్రులు, వైద్య కేంద్రాల పనితీరు మెరుగుదలతో పాటు ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు ప్రత్యేక దృష్టి సారిస్తానని డా. మహతి పేర్కొన్నారు.

# విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

### పోక్సో, సైబర్ నేరాలు, మాదకద్రవ్యాలపై సామర్లకోట పోలీసుల అవగాహన



**సామర్లకోట, ఆగస్టు 11, విశ్వం వాయిస్ న్యూస్ :** విద్యార్థులు చిన్ననాటి నుంచే చట్టాలపై అవగాహన పెంపొందించుకోవడంతో పాటు సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సామర్లకోట పోలీసు సిబ్బంది సూచించారు. సామర్లకోట మండలం వి.కె. రాయపురం ఎంపీపీ ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు వివిధ సామాజిక, భద్రతా అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సామర్లకోట పోలీస్ స్టేషన్‌కు చెందిన డబ్ల్యూహెచ్‌సీ 1655, డబ్ల్యూహెచ్‌జీ 1387 పాల్గొని విద్యార్థులకు పలు అంశాలను వివరించారు. ప్రధానంగా పోక్సో చట్టంలోని నిబంధనలు, చిన్నారులపై లైంగిక వేధింపులను గుర్తించే విధానం, అలాంటి పరిస్థితుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పోలీసులకు సమాచారం అందించే విధానం గురించి అవగాహన కల్పించారు. అలాగే ప్రస్తుతం పెరుగుతున్న సైబర్ నేరాలు, సామాజిక మాధ్యమాల ద్వారా జరిగే మోసాలు, అనుమానాస్పద లింకులు, ఓటీపీలు, వ్యక్తిగత వివరాలను ఇతరులతో పంచుకోవడం వల్ల ఎదురయ్యే ప్రమాదాలు గురించి విద్యార్థులకు వివరించారు. తెలియని వ్యక్తుల నుంచి వచ్చే సందేశాలు, ఫోన్ కాల్స్ విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మాదకద్రవ్యాలు, గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, వాటి వినియోగం విద్యార్థుల ఆరోగ్యం, చదువు, భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపుతుందని హెచ్చరించారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండటంతో పాటు సహచరులు కూడా అలాంటి అలవాట్లకు గురికాకుండా అవగాహన కల్పించాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో పోలీసుల సహాయం కోసం 112 అత్యవసర సేవలను ఎలా వినియోగించుకోవాలి, ఎలాంటి సందర్భాల్లో కాల్ చేయాలి అనే విషయాలను కూడా విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు తమకు ఎదురయ్యే సమస్యలను భయపడకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా పోలీసుల దృష్టికి తీసుకురావాలని, చట్టాలపై అవగాహనతో పాటు బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలని పోలీసు సిబ్బంది సూచించారు.

తాండవ రిజర్వాయర్ నుండి

# నీటిని విడుదల చేసిన స్పీకర్ అయ్యన్న






**కోటనందూరు, ఆగస్టు 11 విశ్వం వాయిస్ న్యూస్ :** ఈ ఖరీఫ్ సీజన్‌కు తాండవ జలాశయం నుండి ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు నీటిని దిగువకు విడుదల చేశారు. తాండవ జలాశయం చైర్మన్ కరక సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు రైతులతో కలిసి ప్రత్యేక పూజలు చేసి జలహారతి ఇచ్చిన అనంతరం కుడి ఎడమ కాలువలకు 100 క్యూసెక్కులు వీటిని విడుదల చేశారు.ప్రస్తుతం జలాశయం నీటిమట్టం 375.2 అడుగులు ఉందని, విడుదల చేసిన ఈ నీరు అనకాపల్లి జిల్లా, కాకినాడ జిల్లాలకు సంబంధించిన జలాశయం ఆయకట్టు 51 వేల ఎకరాలకు నీరు అందుబాటులో ఉంటుందని స్పీకర్ అయ్యన్న పోతుంది తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తాండవ వైస్ చైర్మన్ మేడపురెడ్డి జోగుబాబు, మండల టిడిపి ప్రెసిడెంట్ పోతల సూరిబాబు, కోటనందూరు కోఆపరేటివ్ చైర్మన్ పెనుముచ్చు నాగేశ్వరరావు, తుని నియోజకవర్గ టిడిపి జనరల్ సెక్రెటరీ డాక్టర్ వెలగా వెంకటకృష్ణారావు, వాసం నాగేశ్వరరావు, కోఆపరేటివ్ త్రిమేన్ కమిటీ డైరెక్టర్ బైలపూడి శ్రీ రామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

యనమల గార్డెన్‌లో

# మరో ఆధ్యాత్మిక కార్యక్రమానికి అంకురార్పణ

**వరుణ యాగానికి ఏర్పాట్లుకు స్థలం పరిశీలన - కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని యనమల విజ్ఞప్తి**





**కోటనందూరు, ఆగస్టు 11, విశ్వం వాయిస్ న్యూస్ :** దేశమంతా క్షామం పరిస్థితులు వరుణుడు మోహం చాటేశాడు. చినుకు రాలడం లేదు.ఇదంతా ఎలినో ప్రభావం.వర్షాభావం నుంచి గట్టెక్కించి సమృద్ధిగా వర్షాలు కురవాలని రైతాంగం సుభిక్షంగా ఉండాలని మాజీ ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు, ప్రభుత్వ విఫ్ యనమల దివ్య మహాకార్యాన్ని తలపెట్టారు. దుర్భిక్ష పరిస్థితులు లేకుండా దేశమంతా సుభిక్షంగా ఉండాలని అందులో తుని నియోజకవర్గం కూడ పసిడి పంటలతో కళకళలాడాలని ఆకాంక్షిస్తూ తుని మండలం తేటగుంటలోని యనమల గార్డెన్స్‌లో వరుణ యాగం నిర్వహించాలని, రాజకీయాలకు చోటు లేకుండా రైతు కుటుంబాలతో వరుణ కటాక్షం కోసం యజ్ఞ యాగాలు నిర్వహణకు సంకల్పించారూ మాజీ ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు,ప్రభుత్వ విఫ్ యనమల దివ్య. ఈనెల 19 నుంచి 22వ తేదీ వరకూ అంటే నాలుగు రోజుల పాటు ఋత్వికులు వేదమంత్రోచ్చారణలతో వరుణ యాగం జరుగుతుంది. కేవలం రైతులు రైతు ప్రతినిధులు దంపతులు సారధ్యంలో హోమాలతో వరుణ యాగం నిర్వహిస్తారు. దేవుడి కరుణ కోసం యనమల ఈమహా యజ్ఞం శాస్త్రోక్తంగా నిర్వహించాలని నిర్ణయించారు. ఈనేపథ్యంలో వరుణ యాగం ఏర్పాటు బాధ్యతలను యనమల రాజేష్, చింతనీడి అబ్బాయి, యినుగంటి సత్యనారాయణ, మోతుకూరి వెంకటేష్, కుసుమంచి సత్యనారాయణ, యనమల లక్ష్మణరావు మల్ల గణేష్, గాడి రాజబాబు, అంకంరెడ్డి రమేష్, పెంటకోట భాస్కర సత్యనారాయణ, చొక్కా అప్పారావు,నేమాల అప్పారావు, కుర్రా వెంకట రమణ, దంతులూరి శ్రీనివాసరాజులకు అప్పగించారు. వేదపండితులతో కలిసి వీరందరూ స్థల పరిశీలన చేసి యాగశాలల నిర్మాణ కొలతలు భూమి చదును పనులను దగ్గరుండీ చేయించారు. ఇప్పటికే ఆద్యాత్మిక శిఖరంగా ఖ్యాతి పొందిన యనమల గార్డెన్స్ మరో సారి ఆద్యాత్మిక అనుభూతి అందించనుంది.

త్యాగధనుల స్ఫూర్తితో ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా

# జిల్లావ్యాప్తంగా వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

**స్వాతంత్ర్య సమరయోధుల పోరాటం, త్యాగాలను స్మరించేలా కార్యక్రమాలు - పోలీస్ పరేడ్ మైదానంలో స్టాళ్లు, శకటాలు, సాంస్కృతిక ప్రదర్శనలు**

**'హర్ ఘర్ తిరంగా'లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి - అధికారులకు జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ ఆదేశాలు**



**కాకినాడ, ఆగస్టు 11, విశ్వం వాయిస్ న్యూస్ :** స్వాతంత్ర్య సమరయోధుల పోరాట పటిమను, దేశం కోసం వారు చేసిన అపార త్యాగాలను స్మరించుకుంటూ ప్రజల్లో దేశభక్తి, స్వాతంత్ర్య స్ఫూర్తిని మరింతగా రగిలించేలా జిల్లావ్యాప్తంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కాకినాడ కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్‌తో కలిసి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ఏర్పాట్లు, 'హర్ ఘర్ తిరంగా' ప్రత్యేక కార్యక్రమం నిర్వహణపై అన్ని శాఖల జిల్లా స్థాయి అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆగస్టు 15న కాకినాడ పోలీస్ పరేడ్ మైదానంలో నిర్వహించనున్న జిల్లా స్థాయి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు సంబంధించి వివిధ శాఖల స్టాళ్లు, శకటాల ప్రదర్శన, భద్రతా ఏర్పాట్లు, సాంస్కృతిక కార్యక్రమాలు, విశిష్ట సేవలందించిన అధికారులకు పురస్కారాల ప్రదానం, గౌరవ అతిథులు, అధికారులు, సాధారణ ప్రజల ప్రవేశ మార్గాలు తదితర అంశాలపై కలెక్టర్ సమగ్రంగా సమీక్షించారు.

**దేశభక్తి ఉట్టిపడేలా వేడుకలు**

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ స్వాతంత్ర్యం సాధించేందుకు సమరయోధులు చేసిన పోరాటాన్ని, దేశం కోసం వారు చేసిన త్యాగాలను నేటి తరానికి తెలియజేసేలా కార్యక్రమాలు ఉండాలని సూచించారు. వేడుకల్లో దేశభక్తి, జాతీయ సమైక్యత ఉట్టిపడేలా అన్ని శాఖలు ప్రత్యేక దృష్టి సారించాలని స్పష్టం చేశారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ హాజరయ్యే అవకాశం ఉన్నందున అధికారులు మరింత అప్రమత్తంగా వ్యవహరించి పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు ముందస్తు ప్రణాళికతో పనిచేసి నిర్ణీత సమయానికి ఏర్పాట్లన్నీ పూర్తి చేయాలని స్పష్టం చేశారు.

**ప్రజలకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు**

పోలీస్ పరేడ్ మైదానానికి వచ్చే సాధారణ ప్రజలు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. గౌరవ అతిథులు, జిల్లా అధికారులు, సాధారణ ప్రజలకు వేర్వేరు ప్రవేశ మార్గాలను స్పష్టంగా ఏర్పాటు చేయాలని తెలిపారు. వివిధ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసే స్టాళ్లు, శకటాల్లో రాష్ట్ర ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ప్రతిబింబించేలా రూపొందించాలని సూచించారు. వేడుకలకు హాజరయ్యే వారికి అవసరమైన తాగునీరు, మజ్జిగ అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ప్రభుత్వ కార్యాలయాలను రంగురంగుల విద్యుత్ దీపాలతో ఆకర్షణీయంగా అలంకరించాలని చెప్పారు.

**'హర్ ఘర్ తిరంగా' విజయవంతం చేయాలి**

80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రతి పౌరుడినీ భాగస్వామిని చేసేలా రాష్ట్ర ప్రభుత్వం 'హర్ ఘర్ తిరంగా' ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టిందని కలెక్టర్ తెలిపారు. దేశాభివృద్ధిలో ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను స్వీకరించేలా 'నేను దేశం కోసం ఇది చేస్తాను' అనే సంకల్పంతో ముందుకు రావాలని జిల్లా ప్రజలకు పిలుపునిచ్చారు. ఆగస్టు 10 నుంచి 15వ తేదీ వరకు ఒక చేతిలో జాతీయ పతాకాన్ని పట్టుకుని, మరోవైపు దేశం కోసం తాము చేయబోయే మంచి పనిని తెలియజేస్తూ స్వల్ప నిడివి వీడియోలు లేదా ఫొటోలు రూపొందించి సామాజిక మాధ్యమాల్లో స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలతో పోస్టు చేయాలని సూచించారు. వాటికి ManaKakinadaManaBadhyata గుర్తింపును జత చేయాలని కోరారు. ఆగస్టు 13 నుంచి 15వ తేదీ వరకు ప్రతి ఇంటిపై, వ్యాపార సముదాయాలపై జాతీయ పతాకం ఎగురవేసేలా ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు.

**12న సైకిల్ ర్యాలీలు.. 14న భారీగా మొక్కలు నాటడం**

'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో భాగంగా ఆగస్టు 12న ప్రతి మండలంలో సైకిల్ ర్యాలీలు నిర్వహించి దేశభక్తి ప్రతిజ్ఞ చేయించాలని కలెక్టర్ సూచించారు. ఆగస్టు 14న జిల్లావ్యాప్తంగా భారీ ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టాలని, 14, 15 తేదీల్లో అన్ని ప్రభుత్వ భవనాలను విద్యుత్ దీపాలతో అలంకరించాలని తెలిపారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి డాక్టర్ టి.తిప్పే నాయక్, అదనపు ఎస్పీ కిషోర్ కుమార్‌తో పాటు వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

పోలవరం ఎడమ కాలువలో

# కలుషిత నీటి శుద్ధికి చర్యలు

**సున్నంతో శుద్ధి చేయాలి.. రెండు రోజుల తర్వాత నీటి నాణ్యత పరీక్షించాలి**

**అధికారులకు జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ ఆదేశాలు**



**కాకినాడ, ఆగస్టు 11, విశ్వం వాయిస్ న్యూస్ :** తొండంగి మండలం చిన్నయపాలెం వద్ద పోలవరం ఎడమ కాలువలో గుర్తుతెలియని వ్యక్తులు పడవేసిన కలుషిత పదార్థాలను తొలగించి, కాలువలోని నీటిని పూర్తిస్థాయిలో శుద్ధి చేసేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కాలువలో కలుషితమైన నీటిని శుద్ధి చేసేందుకు సున్నం వినియోగించాలని, అనంతరం నీటి నాణ్యతను పరీక్షించి తదుపరి చర్యలు చేపట్టాలని జలవనరుల శాఖ, కాలుష్య నియంత్రణ మండలి అధికారులకు స్పష్టం చేశారు. మంగళవారం కాకినాడ కలెక్టరేట్ నుంచి జలవనరుల శాఖ, పోలవరం ఎడమ కాలువ ఇంజనీర్లు, కాలుష్య నియంత్రణ మండలి, కర్మాగారాల శాఖ అధికారులతో కలెక్టర్ దృశ్య మాధ్యమ సమావేశం నిర్వహించి పరిస్థితిని సమీక్షించారు.

**నీటి విడుదల పది రోజులు వాయిదా**

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆగస్టు 14 నుంచి పోలవరం ఎడమ కాలువ ద్వారా సాగు, తాగునీటిని విడుదల చేయాలని తొలుత నిర్ణయించినప్పటికీ, ప్రస్తుతం నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా నీటి విడుదలను మరో పది రోజులపాటు వాయిదా వేసినట్లు తెలిపారు. ఈ వ్యవధిలో కాలువలో ఉన్న కలుషిత నీటిని పూర్తిగా శుద్ధి చేయాలని అధికారులను ఆదేశించారు. ముందుగా కాలువలో సున్నం చల్లి శుద్ధి ప్రక్రియ చేపట్టాలని, ఆ ప్రక్రియ పూర్తయిన రెండు రోజుల అనంతరం నీటి నమూనాలను సేకరించి నాణ్యత పరీక్షలు నిర్వహించాలని సూచించారు. పరీక్షల్లో నీరు పూర్తిగా శుద్ధి కాలేదని తేలితే, కలుషిత నీటిని మోటార్ల ద్వారా బయటకు తోడి కాలువను సంపూర్ణంగా శుభ్రపరచాలని స్పష్టం చేశారు. ప్రజలకు అందించే సాగు, తాగునీటి విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్లక్ష్యానికి తావులేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

**డ్రమ్ముల తొలగింపునకు నోటీసులు**

కాలువ పరిసర ప్రాంతాల్లో ఉన్న గుర్తుతెలియని డ్రమ్ములను తొలగించేందుకు తహశీల్దార్లు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు నోటీసులు ప్రదర్శించాలని కలెక్టర్ సూచించారు. సంబంధిత వ్యక్తులు వారం రోజుల వ్యవధిలో వాటిని తొలగించకపోతే నిబంధనల ప్రకారం వాటిని స్వాధీనం చేసుకుని వేలం వేయాలని ఆదేశించారు.

**సీసీ కెమెరాలతో నిరంతర నిఘా**


కాలువ పరిసరాల్లో భవిష్యత్తులో మళ్లీ వ్యర్థాలు, కలుషిత పదార్థాలు పడవేయకుండా కట్టుదిట్టమైన నిఘా ఏర్పాటు చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఇందుకోసం కీలక ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి నిరంతరం పర్యవేక్షించాలని సంబంధిత డీఎస్పీని ఆదేశించారు. కాలువలో వ్యర్థాలు పడవేసే వారిని గుర్తించి, నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకునేలా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా కాలుష్య నియంత్రణ మండలి కార్యనిర్వాహక ఇంజనీర్ ఐ. సూర్యకళ, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ నారాయణ, పోలవరం ఎడమ కాలువ కార్యనిర్వాహక ఇంజనీర్ శ్రీనివాసరావు తదితర అధికారులు పాల్గొన్నారు.

ప్రజలకు సకాలంలో

# రెవెన్యూ సేవలు అందించాలి

**గండేపల్లి తహశీల్దార్ కార్యాలయంలో జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ ఆకస్మిక తనిఖీ**

**పీజీఆర్ఎస్, రీసర్వే అర్జీల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశం**



**గండేపల్లి, ఆగస్టు 11, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రజలకు రెవెన్యూ సేవలు సకాలంలో అందేలా అధికారులు బాధ్యతాయుతంగా పనిచేసి, ప్రభుత్వ సుపరిపాలన ఫలాలను ప్రజలకు చేరువ చేయాలని కాకినాడ జిల్లా జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ సూచించారు. మంగళవారం గండేపల్లి మండల తహశీల్దార్ కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయంలోని వివిధ విభాగాలను పరిశీలించి, అధికారుల పనితీరు, రికార్డుల నిర్వహణ, ప్రజలకు అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా రికార్డు గది, సిబ్బంది హాజరు పట్టికలు, వివిధ శాఖలకు సంబంధించిన దస్త్రాలను జాయింట్ కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించారు. ముఖ్యంగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) ద్వారా అందిన అర్జీలు, వాటి పరిష్కార స్థితి, పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ మాట్లాడుతూ ప్రజలు రెవెన్యూ సేవల కోసం కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి లేకుండా అధికారులు చొరవ చూపాలని సూచించారు. ప్రభుత్వ సేవలను నిర్ణీత గడువులో అందించడంతో పాటు అధికారులు ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ముఖ్యంగా పీజీఆర్ఎస్, భూ రీసర్వేకు సంబంధించిన అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించి, సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని స్పష్టం చేశారు. ప్రజల నుంచి వచ్చిన ప్రతి అర్జీని బాధ్యతతో పరిశీలించి, నిబంధనల మేరకు పరిష్కారం చూపాలని సూచించారు. రెవెన్యూ, భూ పరిపాలన అంశాలపై రాష్ట్ర స్థాయిలో నిరంతరం సమీక్షలు జరుగుతున్న నేపథ్యంలో, మండల స్థాయిలోనూ అధికారులు ఆశించిన పురోగతి సాధించాలని జాయింట్ కలెక్టర్ పేర్కొన్నారు. పెండింగ్ అంశాలను ఎప్పటికప్పుడు పరిష్కరించి, రికార్డుల నిర్వహణలో పారదర్శకత పాటించాలని సూచించారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయ పరిసరాలను పరిశీలించిన ఆయన, కార్యాలయ ప్రాంగణాన్ని నిరంతరం పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. కార్యాలయానికి వచ్చే ప్రజలకు పరిశుభ్రమైన, ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించాల్సిన బాధ్యత అధికారులు, సిబ్బందిపై ఉందన్నారు. ఈ ఆకస్మిక తనిఖీలో గండేపల్లి తహశీల్దార్ పద్మజతో పాటు రెవెన్యూ అధికారులు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ ప్రియాంక మృతికి కారణమైన వారిపై

# కఠిన చర్యలు తీసుకోవాలి

**ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ఏర్పాటు చేసి నిందితులను శిక్షించాలి - కొవ్వొత్తులతో రంగరాయ వైద్య విద్యార్థుల శాంతి ర్యాలీ**




**కాకినాడ, ఆగస్టు 11, విశ్వం వాయిస్ న్యూస్ :** వైద్య విద్యార్థిని డాక్టర్ ప్రియాంక మృతి అత్యంత బాధాకరమని, ఆమె మరణానికి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకుని బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని రంగరాయ వైద్య కళాశాల విద్యార్థులు డిమాండ్ చేశారు. మంగళవారం కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రి నుంచి జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు వైద్య విద్యార్థులు పెద్ద సంఖ్యలో కొవ్వొత్తులతో శాంతి ర్యాలీ నిర్వహించి డాక్టర్ ప్రియాంకకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా వైద్య విద్యార్థులు మాట్లాడుతూ, ఎంతో ఉజ్వల భవిష్యత్తు ఉన్న యువ వైద్యురాలు ప్రియాంక అకాల మరణం తమను తీవ్రంగా కలచివేసిందన్నారు. వైద్య వృత్తిలో ఉన్నత స్థాయికి ఎదిగి ప్రజలకు సేవ చేయాల్సిన యువ వైద్యురాలి జీవితం ఇలా అర్ధాంతరంగా ముగియడం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రొఫెసర్ డాక్టర్ విజయ్ శేఖర్ మాట్లాడుతూ డాక్టర్ ప్రియాంక మృతికి కారణమైన వారిని చట్టపరంగా కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఇటువంటి ఘటనలు భవిష్యత్తులో పునరావృతం కాకుండా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరారు. ప్రియాంక కేసు విచారణను వేగవంతం చేసేందుకు ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ఏర్పాటు చేసి, నిందితులకు కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తరఫున ఆయన ప్రభుత్వాన్ని కోరారు. డాక్టర్ ప్రియాంక ఆత్మకు శాంతి చేకూరాలని వైద్య విద్యార్థులు ప్రార్థించారు. ఈ శాంతి ర్యాలీలో డాక్టర్ తనుజ, డాక్టర్ అశ్విన్, డాక్టర్ సింధుజ, డాక్టర్ రమేష్‌తో పాటు రంగరాయ వైద్య కళాశాలకు చెందిన వైద్య విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# నిరంతరం ప్రజలకు సేవ చేస్తూనే ఉంటాం

## రామసేన అధ్యక్షులు, బీజేపీ నాయకులు కంబాల



**సీతానగరం, ఆగస్టు 11, విశ్వం వాయిస్ న్యూస్ :** సీతానగరం జీ.వీ.కే ఫంక్షన్ హాల్ లో విశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షులు, భారతీయ జనతా పార్టీ జగ్గంపేట నియోజకవర్గం బీఎల్ఏ-1 కంబాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం మొదటి రోజు సీతానగరం గ్రామానికి సంబంధించి నిర్వహించిన, బంగారు వరలక్ష్మి కానుక సీజన్-4 లక్కీడ్రా కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి భారీగా మహిళలు, తరలివచ్చి పాల్గొన్నారు. తొలిత కంబాల శ్రీనివాసరావు, దంపతులకు సీతానగరం గ్రామస్తులు, నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు స్వాగతం పలికి, ఘనంగా సత్కరించారు. అనంతరం కంబాల శ్రీనివాసరావు, పద్మావతి దేవి గంగారత్నం దంపతులకు అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికి, వేదమంత్రోచ్చారణల మధ్య ఆశీర్వచనాలు అందించారు. అనంతరం వరలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన, కంబాల దంపతులు జ్యోతి ప్రజ్వలన చేసి, జాతీయ గీతాలాపనతో కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కంబాల శ్రీనివాసరావు మాట్లాడుతూ మహిళా మూర్తుల్లో హైందవ చైతన్యం పెంపొందించడం, సనాతన ధర్మ విలువలను బలోపేతం చేయడం కోసం శ్రావణమాసంలో ప్రతి పేద మహిళ ఆనందంగా వరలక్ష్మి వ్రతాన్ని జరుపుకోవాలనే సంకల్పంతోనే బంగారు వరలక్ష్మి కానుక కార్యక్రమాన్ని 2023 సంవత్సరంలో శ్రీకారం చుట్టామని తెలిపారు. గత నెల 11 తేదీ నుంచి ఇప్పటివరకు పలు గ్రామాలలో 60 వేలు పట్టు చీరలను పంపిణీ చేయడం జరిగిందన్నారు. బంగారు వరలక్ష్మి కానుక సీజన్-4 లక్కీ డ్రా కార్యక్రమంలో రాజానగరం, రంపచోడవరం, జగ్గంపేట మూడు నియోజకవర్గంలో 4 వేలు బంగారు రూపులు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. మన దేశం విశ్వగురువని, మన సంస్కృతి సాంప్రదాయాలను, ప్రతి ఒక్కరు పాటించాలని సూచించారు. మూడు నియోజకవర్గంలో విద్య, వైద్య ఆర్థికపరంగా సొంత నిధులతో 18 రకాల సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. అనంతరం నిర్వహించిన లక్కీడ్రాలో గెలిపోందిన 100 మంది మహిళలకు బంగారు రూపులు, పట్టుచీరలు, పసుపు, కుంకుమను కంబాల శ్రీనివాసరావు దంపతులు ఉచితంగా పంపిణీ చేసారు. అలాగే లక్కీడ్రాలో గెలిపోందని 1500 మంది మహిళలకు పట్టు చీరలు, పసుపు, కుంకుమ పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో రామసేన సభ్యులు, బీజేపీ నాయకులు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# విధ్వంసం నుంచి వికాసం వైపు రాష్ట్రం అడుగులు

## కూటమి ప్రభుత్వ ఆలోచనా విధానానికి మోరంపూడి ఫ్లైఓవర్ నిదర్శనం - మోరంపూడి సమస్యకు శాశ్వత పరిష్కారం
## రూ.3.40 కోట్లతో మోరంపూడి ఫ్లైఓవర్ అప్రోచ్ రోడ్ల పనులకు శంకుస్థాపనలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్



**రాజమహేంద్రవరం, ఆగస్టు 11, విశ్వం వాయిస్ న్యూస్ :** విధ్వంసం నుంచి వికాసం వైపు రాష్ట్రం అడుగులు వేస్తోందని, కూటమి ప్రభు త్వం ప్రజల అవసరాలకు అనుగుణంగా పనిచేస్తోందని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. మోరంపూడి ఫ్లైఓవర్ వద్ద అటు ఇటుగా అప్రోచ్, సర్వీస్ రోడ్ల నిర్మాణ పనులకు మంగళవారం ఆయన రూ.3.40 కోట్ల అంచనా వ్యయంతో శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు కూటమి ప్రభుత్వ ఆలోచనా విధానం, పరిపాలన ఏ విధంగా ఉందో చెప్పదానికి మోరంపూడి ఫ్లైఓవర్ ఒక నిదర్శనమన్నారు. గత పాలకుల విధ్వంసకర పరిపాలన కార ణంగా అనేక అభివృద్ధి పనులు అస్త వ్యస్తమై ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొ న్నారని, అందులో మోరంపూడి ఫ్లైఓవర్ సమస్య కూడా ఒకటని అన్నారు. గతంలో కాంట్రాక్టర్‌ను తీవ్ర ఇబ్బంది లకు గురిచేయడం, కమీషన్ల కోసం వేధింపులకు పాల్పడటంతో ఆయన భయ భ్రాంతులకు గురయ్యారని ఆరోపిం చారు. కూటమి ప్రభుత్వం అధికా రంలోకి వచ్చిన తర్వాత కూడా అదే కాంట్రాక్టర్‌తో పనులు కొనసాగించే అవకాశంకల్పించామని, అయితే అప్పటికే ఎదురైన పరిస్థితుల కారణంగా ఇక పనులు చేయలేనని ఆయన చెప్పినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో ఎంపీ దగ్గుబాటి పురంధేశ్వరి జోక్యం చేసుకుని పాత కాంట్రాక్టర్‌ను టెర్మినేట్ చేసి, కొత్తగా టెండర్లు పిలిచే ప్రక్రియను చేపట్టారని వివరించారు. టెండర్ ప్రక్రియతో పాటు వివిధ అధికారిక ప్రక్రియలు పూర్తి కావడానికి కొంత సమయం పట్టిందని, అది ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేకపోవడం వల్ల కాదని స్పష్టం చేశారు. మోరంపూడి ఫ్లైఓవర్‌కు సంబంధించిన ప్రధాన పనులతో పాటు అటు ఇటుగా ఉన్న సర్వీస్ రోడ్ల నిర్మాణానికి రూ.3.40 కోట్లతో పనులు ప్రారంభిస్తున్నామని తెలిపారు. ఇదే తరహాలో పలు ప్రాంతాల్లో పనులు చేసేందుకు సుమారు రూ.7.50 కోట్ల మేరకు టెండర్ వచ్చినట్లు వెల్లడించారు. "మంత్రాలు చదివితే చింతకాయలు రాలవు" తాను జూలై 31న ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు పంపిణీ సందర్భంగా నిర్వహించిన మీడియా సమావేశంలోనే ఆగస్టు రెండో వారంలో మోరంపూడి సర్వీస్ రోడ్డు పనులు ప్రారంభిస్తామని, కాంట్రాక్టర్‌కు సంబంధించిన ప్రక్రియ పూర్తవుతోందని స్పష్టంగా చెప్పానని ఆదిరెడ్డి శ్రీనివాస్ గుర్తుచేశారు. పనులు ప్రారంభమయ్యే సమయం రాగానే కొందరు దీనికి తామే కారణమన్నట్లుగా ప్రచారం చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. "మంత్రాలు చదివితే చింతకాయలు రాలవు... చింతకాయలు రాలే సమయంలో మంత్రాలు చదివి, అవి నా వల్లే రాలాయని చెప్పుకునే మనుషులు తయారయ్యారు... క్రెడిట్ చోరీలో గొడ్డలి పార్టీ వాళ్లు సిద్ధహస్తులుగా తయారయ్యారు" అంటూ ఆయన తీవ్ర వ్యాఖ్యలు చేశారు ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్. తాను ముందుగానే ప్రకటించిన ప్రకారమే ప్రస్తుతం మోరంపూడి సర్వీస్ రోడ్డు పనులు ప్రారంభమవుతున్నాయని చెప్పారు. "నీ మంత్రాల వల్ల చింతకాయలు రాలేదు.. నువ్వు చేసిన పనుల వల్ల కాంట్రాక్టర్ అన్యాయానికి గురయ్యారు" అంటూ గత పాలనపై విమర్శలు చేశారు. మోరంపూడి ఫ్లైఓవర్ వద్ద సర్వీస్ రోడ్లు లేకపోవడం వల్ల ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరడంతో ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. వారం రోజుల్లో సర్వీస్ రోడ్డు పనులు పూర్తి చేస్తామని హైవే పీడీ కూడా తెలిపారని ఎమ్మెల్యే వాసు చెప్పారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. మోరంపూడి ప్రాంతం సమస్య సిటీ, రూరల్ శాసనసభ నియోజకవర్గాల పరిధికి సంబంధించినదని ఆదిరెడ్డి శ్రీనివాస్ వివరించారు. ఈ ప్రాంతంలో కొంత భాగం రాజమహేంద్రవరం సిటీ నియోజకవర్గంలో, మరికొంత భాగం రూరల్ నియోజకవర్గంలో ఉందన్నారు. రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి కూడా ఈ సమస్య పరిష్కారానికి ఫాలోఅప్ చేశారని, తాను కూడా నిరంతరం అధికారులతో సమన్వయం చేశానని తెలిపారు. ముఖ్యంగా రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి చొరవ తీసుకుని టెండర్ ప్రక్రియను ముందుకు తీసుకెళ్లడంతో సమస్య పరిష్కారానికి మార్గం సుగమమైందన్నారు. ప్రజలు కోరుకున్న మోరంపూడి ఫ్లైఓవర్ అప్రోచ్, సర్వీస్ రోడ్ల సమస్యకు కూటమి ప్రభుత్వం శాశ్వత పరిష్కారం చూపుతోందని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ తెలిపారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని పనులను చేపట్టామని, అభివృద్ధి విషయంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, అధిక సంఖ్యలో అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# 14న మోడల్ కెరీర్ సెంటర్లో జాబ్ మేళా

## నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు : జిల్లా ఉపాధి అధికారి సిహెచ్ శిరీష



**రాజమహేంద్రవరం, ఆగస్టు 11, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పు గోదావరి జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు రాజమండ్రి అర్బన్ నియోజకవర్గంలోని ఉపాధి కార్యాలయం ప్రాంగణంలో ఈనెల 14వ తేదీ ఉదయం 9:00 గంటలకు జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి సిహెచ్. శిరీష మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేళాలో ప్రముఖ ఆపిల్ బ్రాడ్ బ్యాండ్ సర్వీస్ ప్రై . లి., ఠాగూర్ లాబ్స్ కంపెనీలలో పలు పోస్టల భర్తీకొరకు ఇంటర్వ్యూలు నిర్వహించబడనున్నాయని ఆమె తెలిపారు. పదవ తరగతి, ఇంటర్, ఐ టీ ఐ, ఏదైనా డిగ్రీ, డిప్లొమా లేదా బీటెక్ పూర్తి చేసి అనుభవం ఉన్న లేదా ఆశక్తి గల 19 నుండి 40 సంవత్సరాల వయస్సు గల అభ్యర్థులు ఈ ఉద్యోగాలకు అర్హులని వివరించారు. ఎంపికైన వారికి తక్షణమే ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని చెప్పారు. ఆసక్తి గల అభ్యర్థులు నేరుగా **employment.ap.gov.in** లింక్ ద్వారా తమ పూర్తి వివరాలతో రిజిస్టర్ అయి, రెజ్యూమే, ఆధార్, సంబంధిత సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలతో సిద్ధంగా మేళాకు హాజరుకావాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9398318601 నంబర్‌ను సంప్రదించవచ్చని జిల్లా ఉపాధి అధికారి సిహెచ్ శిరీష తెలిపారు.

### మెడికో మృతి కేసులో
# నిందితుల కస్టడీకి పిటిషన్

**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** వైద్య విద్యార్థిని ప్రియాంక మృతికి కారణమైన నిందితులను కస్టడీకి కోరుతూ.. రాజమహేంద్రవరంలోని ప్రకాశంనగర్ పోలీసులు సోమవారం న్యాయస్థానంలో పిటిషన్ దాఖలుచేశారు. ప్రసాద్ ఆదిత్య మాల్ వద్ద ఈ నెల 3న కారుతో ఢీకొట్టిన ఘటనపై ఇప్పటికే బీఎన్ఎస్ సెక్షన్ 105 (హత్యా నేరం) కింద కేసు నమోదు చేశారు. నిందితులు సురవరపు దశ్వంత్, ఆండ్రూ జోసెఫ్ ఎడ్వర్డ్సలను మూడు రోజుల పోలీసు కస్టడీకి అను మతించాలని న్యాయస్థానానికి విన్నవించారు.

### రూ.50 వేల ఎల్ఓసిని
# అందజేసిన ఎమ్మెల్యే బత్తుల బల రామకృష్ణ



**సీతానగరం, ఆగస్టు 11, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మం డలం రామచంద్రపురం గ్రామానికి చెందిన అంబటి నాగలక్ష్మికి అనారోగ్య రీత్యా వైద్య ఖర్చులు నిమిత్తం రాజానగరం నియోజకవర్గంలో శాసన సభ్యులు బత్తుల బలరామకృష్ణను సహాయము కోరగా వెంటనే స్పందించి వారి సిఫారసుతో మంజూరైన రూ.50,00,000/- ల రూపాయల ఎల్ఓసి ను ఎంఎల్ఏ బత్తుల బలరామకృష్ణ కుటుంబ సభ్యులకు అందజేసారు. వీరి వెంట జనసేన,తెలుగుదేశం,బిజెపి పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

### మూడు రోజుల పాటు
# నిందితులు ఎక్కడ ఉన్నారు?

- అధికార పార్టీ అండతో నిందితులను దాచిపెట్టారా?
- డీఎస్పీ "చిన్న యాక్సిడెంట్" అని ఎందుకు చెప్పారు?
- సీసీటీవీ పుటేజీలు పోలీసులకు కనిపించలేదా?
- మెడికో ప్రియాంక మృతిపై సమగ్ర విచారణ జరపాలి..
- స్థానిక ఎమ్మెల్యేకు ఎందుకు బాధ్యత లేదు..?
- కూటమి ప్రభుత్వంపై మార్గాని భరత్ రామ్ ఫైర్




**రాజమహేంద్రవరం, ఆగస్టు 11, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజమహేంద్రవరంలో సంచలనం సృష్టించిన మెడికో ప్రియాంక ఘటనపై సమగ్ర విచారణ జరిపితేనే అన్ని వాస్తవాలు బయటికి వస్తాయని మాజీ ఎంపీ, వైసిపి జాతీయ అధికార ప్రతినిధి, సిటీ నియో జకవర్గ ఇన్‌చార్జ్ మార్గాని భరత్ రామ్ స్పష్టం చేసారు. ఈనెల 3వ తేదీన ఆమెను కారుతో గుద్ది తీవ్రంగా గాయ పరిస్తే 6వ తేదీ వరకు ఎందుకు బయటకు రాకుండా చేసారని ఆయన నిలదీసారు. స్థానిక వీఎల్ పురం మార్గాని ఎస్టేట్స్‌లో ఉన్న వైసిపి సిటీ కార్యాలయంలో మంగళ వారం జరిగిన మీడియా సమావేశంలో ఈ కేసు విషయంలో ఆయన కూటమి ప్రభుత్వానికి పలు ప్రశ్నలు సంధించారు. మూడు రోజుల పాటు ఘటనను ఎందుకు గోప్యంగా ఉంచారు? ఆగస్టు 3న ఘటన జరిగితే ఆగస్టు 6న మాత్రమే అరెస్ట్ ఎందుకు? చూపించారని నిలదీసారు. నిందితులు పరారీలో ఉన్నారా?, పోలీసు కస్టడీలో ఉన్నారా?.. ఇంత దారుణమైన ఘటనను ప్రమాదంగా ఎందుకు చూపించారు? అని ప్రశ్నిం చారు. మొదట రాష్ అండ్ నెగ్లిజెంట్ డ్రైవింగ్ కేసు ఎందుకు నమోదు చేశారు? స్టేషన్ బెయిల్ వచ్చే సెక్షన్లు ఎందుకు పెట్టారు?, డిఎస్పీ చిన్న యాక్సిడెంట్ అని ఎందుకు చెప్పారో విచారణ చేస్తేనే తేలుతుందన్నారు. పలుమార్లు ఆమె ప్రయాణిస్తున్న స్కూటీని ఢీకొట్టి, తలపై నుంచి కారు నడిపిన ఘటనలో తీవ్రమైన సెక్షన్లు ఎందుకు నమోదు చేయలేదో చెప్పాలని డిమాండ్ చేసారు. స్థానిక ఎమ్మెల్యే తనకు బాధ్యత లేదన్నట్టుగా ప్రవర్తించారని విమర్శించారు. డాక్టర్ ప్రియాంక విషయంపై ఫేస్ బుక్‌లో నేను పోస్ట్ చేసిన అంశాన్ని ఫేస్ బుక్ మెటాకి పంపించి డిలీట్ చేయించారని ఆరోపించారు. మద్యం మత్తులో జరిగిన హిట్ అండ్ రన్‌గా కేసును ఎందుకు చూపించారు? డాక్టర్ ప్రియాంక కుటుంబ సభ్యుల వాదనను ఎందుకు పట్టించుకోలేదు? అని ఈ ప్రశ్నలన్నీ వాస్తవం కాదో చెప్పాల్సిన బాధ్యత ప్రభుత్వానికి లేదా అన్నారు. ప్రకాష్ నగర్ పోలీసుల విచారణ తీరుపై కూడా తమకు చాలా అనుమానాలు ఉన్నాయని అవసరమైతే వారిపై కూడా విచారణ జరిపించేందుకు ప్రభుత్వం చొరవ తీసుకోవాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా కేసు విచారణ చేస్తున్న సిఐ బాజీ లాల్ ఆరోజు ఎవరెవరితో మాట్లాడారో ఫోన్ కాల్ డేటాను బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. రెండు తెలుగు రాష్ట్రాలను కుదిపేసిన ఘటనపై సోషల్ మీడియా ఎందుకు మౌనంగా ఉంది? రాజమండ్రి సోషల్ మీడియా పేజీలు పోస్టులు ఎందుకు చేయలేదని నిలదీసారు. కారుతో ఢీకొట్టిన తరువాత ప్రసాదిత్య మాల్ వద్ద నుంచి ఎవరెవరికి ఫోన్లు వెళ్లాయి, ఏం మాట్లాడారు అన్నది కాల్ డేటా వెల్లడించాలని డిమాండ్ చేసారు. ఘటనను అణిచివేయడానికి రాజకీయ ఒత్తిడి ఉందా?, నిజాలను దాచేందుకు ప్రయత్నం జరిగిందా? ప్రజలకు పూర్తి సమాచారం ఎందుకు ఇవ్వలేకపోయారని ప్రశ్నించారు. తెలంగాణ సీఎం ప్రియాంక ఘటన సీరియస్‌గా తీసుకోవాలని, రేవంత్ రెడ్డి స్పందించాలని కోరారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి అసలు వాస్తవాలు బయట పెట్టేవరకు వైసిపి తరపున ప్రియాంక కుటుంబానికి తాము అండగా నిలబడతామని భరోసా ఇచ్చారు. భవిష్యత్తులో ఇటువంటి దారుణమైన ఘటనలు జరగకుండా నిందితులకు కఠిన శిక్షలు పడేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని మార్గాని భరత్ డిమాండ్ చేసారు.

# 13న ఓటర్ల జాబితా పరిశీలకురాలు మాధవీలత జిల్లా పర్యటన



**రాజమహేంద్రవరం, ఆగస్టు 11, విశ్వం వాయిస్ న్యూస్ :** ఎన్నికల కమిషన్ ఆఫ్ ఇండియా చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) మూడో దశలో భాగంగా డ్రాఫ్ట్ ఓటర్ల జాబితా ప్రచురణ అనంతరం క్లెయిమ్స్, అభ్యంతరాల పరిశీలన కోసం తూర్పు గోదావరి జిల్లా - ఓటర్ల జాబితా పరిశీలకులు డా. కె. మాధవీలత ఈ నెల 13న తూర్పుగోదావరి జిల్లాకు విచ్చేయనున్నట్లు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి కీర్తి చేకూరి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా అదే రోజు ఉదయం 11.30 గంటలకు బొమ్మూరు కలెక్టరేట్‌లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల అధ్యక్షులు, కార్యదర్శులు, ప్రజా ప్రతినిధులతో సమావేశం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పార్లమెంట్ సభ్యులు, శాసన మండలి సభ్యులు, శాసనసభ సభ్యులు మరియు అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు సమావేశానికి హాజరుకావాలని ఆహ్వానించారు. సమావేశం అనంతరం ఓటర్ల జాబితా పరిశీలకులు క్షేత్రస్థాయిలో ఆకస్మిక తనిఖీలు (సర్‌ప్రైజ్ విజిట్) నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు.







వాళ్లంతా నన్ను అందుకే దూరం పెట్టారు..

# నాతో మాట్లాడలేదు.. జబర్దస్త్ వర్ష..

జబర్దస్త్ వర్ష గురించి చెప్పక్కర్లేదు. బుల్లితెరపై సీరియల్స్ ద్వారా నటిగా సినీ ప్రయాణం స్టార్ట్ చేసిన వర్ష. ఆ తర్వాత జబర్దస్త్ షో ద్వారా విపరీతమైన గుర్తింపు సంపాదించుకుంది. తన కెరీర్ ఆరంభంలో కుటుంబం, ముఖ్యంగా అక్కచెల్లెళ్ల నుండి ఎదుర్కొన్న వ్యతిరేకతను పంచుకుంది. జబర్దస్త్ లో వచ్చిన గుర్తింపుతో కుటుంబం ఆమెను అంగీకరించిందని, అది తన జీవితంలో మర్చిపోలేని బహుమతి అని తెలిపింది. జబర్దస్త్ ద్వారా ప్రేక్షకుల హృదయాల్లో స్థానం సంపాదించుకున్న వర్ష, తన వ్యక్తిగత జీవితం, కెరీర్ ప్రయాణం గురించి ఆసక్తికరమైన విషయాలను తన పాడ్ కాస్ట్ లో పంచుకున్నారు. ఆమె సినీరంగ ప్రవేశం, కుటుంబం నుండి ఎదురైన తొలి ప్రతిఘటన, ఆ తర్వాత జబర్దస్త్ తో లభించిన గుర్తింపు, కుటుంబంతో సయోధ్య వంటి అంశాలపై ఆమె మాట్లాడారు. తొలుత తాను సినిమాలు, ఆ తర్వాత సీరియల్స్ చేసి, ఆ తర్వాత జబర్దస్త్ లోకి వచ్చానని వర్ష వివరించారు. ఈ రంగంలోకి వచ్చిన కొత్తలో తన కుటుంబ సభ్యులు, ముఖ్యంగా తన అక్కచెల్లెళ్లు తనతో మాట్లాడేవారు కాదని ఆమె గుర్తు చేసుకున్నారు. "నువ్వు మా చెల్లివని ఎక్కడా చెప్పొద్దు" అని కూడా అనేవారని, దీనివల్ల తాను చాలా బాధపడేదాన్నని వర్ష భావోద్వేగంగా వెల్లడించారు. ఈ ఫీల్డ్ అంటే వారికి ఇష్టం లేకపోవడం, "మీ చెల్లి ఏంటి ఇట్లా" అని చుట్టుపక్కల వారు అనడం వల్ల వారు ఇబ్బంది పడి అలా అన్నారని ఆమె పేర్కొన్నారు. అయితే, జబర్దస్త్ లోకి వచ్చిన తర్వాత, ముఖ్యంగా ఆది గారితో చేసిన స్కిట్ ల ద్వారా ప్రజల్లో గుర్తింపు లభించిన తర్వాత పరిస్థితి మారిందని వర్ష వివరించారు. "మీ చెల్లి జబర్దస్త్ లో కనిపించింది, ఆది గారి స్కిట్‌లో కనిపించింది, చాలా బాగుంది" అని ప్రజలు చెప్పడం మొదలుపెట్టారని, దీంతో తన కుటుంబం, అక్కచెల్లెళ్లు మళ్లీ తనతో మాట్లాడటం మొదలుపెట్టారని ఆమె సంతోషం వ్యక్తం చేశారు. తన తల్లి మాత్రం ఎల్లప్పుడూ తనకు అండగా నిలిచిందని, ఎక్కడికి వెళ్లినా, ఏం చేసినా వెనుక ఉండి సహాయం చేసిందని వర్ష కృతజ్ఞతలు తెలిపారు. జబర్దస్త్ తనకు ఇచ్చిన అతిపెద్ద బహుమతి, జీవితంలో ఎప్పటికీ మర్చిపోలేని గిఫ్ట్ తన కుటుంబంతో మళ్లీ కలపడమే అని ఆమె చెప్పారు. సోషల్ మీడియాలో తన పోస్టుల గురించి, దానివల్ల ఇంట్లో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అనే ప్రశ్నకు వర్ష సమాధానమిస్తూ, తన కుటుంబ సభ్యులు ఎక్కువగా ఇన్‌స్టాగ్రామ్ చూడరని తెలిపారు. అయితే, బంధువులు లేదా ఇతరులు చూసి అనుకోవచ్చు అని అంగీకరించారు. తాను చేసే పనులు కొంతమందికి సహాయపడతాయని కుటుంబానికి తెలుసని వర్ష వివరించారు. ఇన్‌స్టాగ్రామ్ ద్వారా వచ్చే డబ్బును కొంతమందికి సహాయం చేయడానికి ఉపయోగిస్తున్నానని, అంతేకాకుండా ప్రతి ఏటా, ప్రతి నెలా తన కుటుంబం కూడా కొంతమందికి సహాయం చేస్తుందని ఆమె తెలిపారు. డబ్బుల కోసమే కాకుండా, తనకి కొన్ని ఫ్యాషన్స్, ఇష్టాలు, సరదాలు కూడా ఉన్నాయని వర్ష స్పష్టం చేశారు. ఇప్పటివరకు తన కుటుంబ సభ్యులు తన పోస్టుల గురించి తనతో ఎప్పుడూ మాట్లాడలేదని ఆమె చెప్పారు. ఈ సందర్భంలో యూట్యూబ్ స్కిట్స్ టీమ్ నుండి ఒకరు వర్ష మంచి మనసున్న వ్యక్తి అని, మధ్యాహ్నం మంచి ఫుడ్ తెప్పించేదని పటాస్ ప్రవీణ్ చెప్పుకొచ్చారు. అలాగే, ఆమెపై ఎన్నో డైలాగులు వేసి ఆడుకున్నా, ఆమె వాటిని స్వీకరించే వ్యక్తిత్వం గొప్పదని, అందుకే ఈ మంచి పొజిషన్‌లో ఉన్నారని తెలిపారు. దీనిపై వర్ష స్పందిస్తూ, ఈ రోజు తాను ఈ స్థాయిలో ఉన్నానంటే దాని వెనుక చాలా కష్టం, బాధ ఉందని, తనను ఈ స్టేజ్ లో నిలబెట్టినవారు, ఆదరించినవారు అందరూ బాగుండాలని కోరుకుంటున్నానని తెలిపారు.

# హీరో జూనియర్ ఎన్టీఆర్‌కు సర్జరీ.. ఎప్పుడు, ఎక్కడంటే?



ఇటీవల సినిమా షూటింగ్‌లో గాయపడ్డ హీరో జూనియర్ ఎన్టీఆర్ మేజర్ సర్జరీకి రెడీ అవుతున్నారు. తాజాగా ఈ విషయంపై ఆయన కార్యాలయం నుంచి అధికారిక ప్రకటన వెలువడింది. వైద్యుల సలహా మేరకు శస్త్రచికిత్స కోసం ఎన్టీఆర్ అన్ని విధాలా రెడీ అవుతున్నారని ఆయన టీమ్ తెలిపింది. గ్లోబల్ స్టార్ జూనియర్ ఎన్టీఆర్ మేజర్ సర్జరీకి రెడీ అవుతున్నారు. ఇటీవల ఓ సినిమా షూటింగ్ లో ఆయన గాయపడిన సంగతి తెలిసిందే. భుజానికి గాయం కారణంగా కొన్ని రోజులుగా ఆయన విశ్రాంతి తీసుకుంటున్నారు. అయితే గాయం తీవ్రత ఎక్కువగా ఉండడంతో వైద్యుల సలహా మేరకు శస్త్రచికిత్సకు సిద్ధమవుతున్నారు తారక్. తాజాగా ఈ విషయంపై ఆయన కార్యాలయం నుంచి అధికారిక ప్రకటన వెలువడింది. బుధవారం (ఆగస్టు 12) హైదరాబాద్ లోని కిమ్స్ ఆస్పత్రిలో ఎన్టీఆర్ కు సర్జరీ జరగనుందని ఆయన టీమ్ తెలిపింది. సర్జరీ తర్వాత ఎప్పటికప్పుడు తారక్ హెల్త్ అప్‌డేట్స్ ఇస్తామంటూ టీమ్ వెల్లడించింది. ప్రస్తుతం ఈ విషయం నెట్టింట వైరల్ గా మారింది. ముఖ్యంగా ఈ వార్త తెలిసినప్పటి నుండి ఎన్టీఆర్ అభిమానులు కాసింత ఆందోళనకు గురవుతున్నారు. ఆయన త్వరగా కోలుకోవాలని సోషల్ మీడియా వేదికగా ఆకాంక్షిస్తూ పోస్టులు పెడుతున్నారు. ఇక సినిమాల విషయానికి వస్తే.. ప్రస్తుతం డ్రాగన్ సినిమా చేస్తున్నారు ఎన్టీఆర్. కేజీఎఫ్, సలార్ సినిమాలతో పాన్ ఇండియా రేంజ్ లో ఫేమస్ అయిన దర్శకుడు ప్రశాంత్ నీల్ ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. ఎన్టీఆర్ సరసన లేటెస్ట్ సెన్సేషన్ రుక్మిణీ వసంత్ హీరోయిన్ గా నటిస్తోంది. అలాగే నేషనల్ క్రష్ రష్మిక మందన్నా కూడా నటిస్తోందని ప్రచారం జరుగుతోంది. అయితే ఈ సినిమా షూటింగ్ లోనే ఎన్టీఆర్ భుజానికి గాయమైనట్లు తెలుస్తోంది. కొద్ది రోజులు విశ్రాంతి తీసుకుంటే సరిపోతుందనుకున్నారు కానీ.. గాయం తీవ్రత ఎక్కువగా ఉండడం, భవిష్యత్ లోనూ ఎలాంటి పరిణామాలు తలెత్తకుండా ఉండడానికి ఇప్పుడు సర్జరీ అవసరమని వైద్యులు చెప్పినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే ఎన్టీఆర్ శస్త్ర చికిత్స కోసం అన్ని విధాలా రెడీ అవుతున్నట్లు తెలుస్తోంది.

సంతోషం వచ్చినా, బాధొచ్చినా మాట్లాడేది ఆయనతోనే..

# పూరి కూతురిలో అద్భుతమైన టాలెంట్..



టాలీవుడ్ డైరెక్టర్ పూరీ జగన్నాథ్ ప్రస్తుతం స్లమ్ డాగ్ అనే చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఇందులో కోలీవుడ్ స్టార్ విజయ్ సేతుపతి, టబు, సంయుక్త మీనన్ ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. ఇటీవల విడుదలైన టబు ఫస్ట్ గ్లింప్స్ సినిమాపై అంచనాలు పెంచేశాయి. మరోవైపు పూరీ తనయ ఇన్ స్టాలో చాలా యాక్టివ్ గా ఉంటూ నిత్యం ఏదోక పోస్ట్ చేస్తుంది. తాజాగా ఆమె టాలెంట్ చూసి ఆశ్చర్యపోతున్నారు ఫ్యాన్స్. "కొన్నేళ్ల క్రితం ఎలాంటి ప్రాక్టీస్ లేకుండానే పెన్‌తో మండల చిత్రాలు గీయడం ప్రారంభించాను. ఇది నేను ఎక్కడో నేర్చుకున్న నైపుణ్యం కాదు, నాలో సహజంగా పుట్టుకొచ్చిన ఒక అభిరుచి. అయితే ఇటీవల కేదారనాథ్ ఆలయానికి సంబంధించిన ఓ అందమైన కల వచ్చింది. అది ఏదో సాధారణ కలలా అనిపించలేదు, సాక్షాత్తు శివుడే నన్ను పిలుస్తున్నట్లుగా అనిపించింది. వెంటనే తర్వాతి రోజే కేదారనాథ్ ఆలయాన్ని మండల ఆర్ట్ శైలిలో గీయడం ప్రారంభించాను" అని పవిత్ర వెల్లడించింది. దాదాపు వారం రోజుల పాటు రాత్రింబవళ్లు శ్రమించి ఈ చిత్రాన్ని పూర్తి చేసినట్లు పవిత్ర పేర్కొంది. ప్రతి గీతలోనూ ఒక ప్రార్థనను, ప్రతి ఆకృతిలోనూ ఒక భావాన్ని, ప్రతి రంగులోనూ తన భక్తిని నింపుతూ ఈ కేదారనాథ్ చిత్రాన్ని తీర్చిదిద్దింది. ఈ చిత్రం పూర్తయ్యాక తన మనసులో చెప్పలేని ప్రశాంతత లభించిందని తెలిపింది. మొదట ఈ చిత్రాన్ని తన కుటుంబ సభ్యులతో మాత్రమే పంచుకున్నప్పటికీ, ఇప్పుడు శివుని పట్ల ఉన్న కృతజ్ఞతాభావంతో అభిమానులందరితో షేర్ చేసుకుంటున్నానని పేర్కొంటూ "హర హర మహాదేవ్" అని రాసుకొచ్చింది. పవిత్ర తాను గీసిన కేదారనాథ్ ఆలయ చిత్రంతో దిగిన ఫొటోలను సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో, ఆమెలోని ఈ దాగి ఉన్న నైపుణ్యాన్ని చూసి నెటిజన్లు, సినీ అభిమానులు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు.

# డబ్ల్యుటిసి ఫైనల్ సమీకరణాలు..

ఏ జట్టు ఎన్ని గెలవాలంటే?




వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్‌కి చాలా టైమ్ ఉంది. అయితే శ్రీలంకతో భారత్ టెస్టు సిరీస్ ఈ నెల 15 నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో 'ఫైనల్‌కి మన జట్టు వెళ్లాలంటే ఎన్ని మ్యాచ్‌లు గెలవాలి?' అనే చర్చ మొదలైంది. ఈ నేపథ్యంలో ఒక్కో జట్టు అవకాశాల సంగతి చూద్దాం.

ఈ డబ్ల్యుటిసి సీజన్‌లో ఆస్ట్రేలియా ఇంకా 14 టెస్టులు ఆడనుంది. అందులో ఎనిమిది మ్యాచుల్లో గెలిస్తే ఫైనల్‌కి చేరుతుంది.

పాయింట్ల పట్టికలో రెండో స్థానంలో ఉన్న దక్షిణాఫ్రికా ఇంకా 10 మ్యాచ్‌లు ఆడాల్సి ఉంది. అందులో ఆరు టెస్టుల్లో గెలిస్తే చాలు.

న్యూజిలాండ్ చేతిలో ఇప్పుడు 10 మ్యాచ్‌లు ఉన్నాయి. అందులో ఏడు గెలిస్తే ఫైనల్‌లో చోటు దక్కుతుంది.

నాలుగో స్థానంలో ఉన్న బంగ్లాదేశ్ ఆరు మ్యాచుల్లో గెలిస్తే ఫైనల్ టికెట్ దక్కుతుంది. వారింకా 8 మ్యాచ్‌లు ఆడాల్సి ఉంది.

టీమ్ ఇండియా చేతిలో ఇంకా తొమ్మిది టెస్టులు ఉన్నాయి. వాటిలో 8 మ్యాచ్‌లు గెలిస్తే ఫైనల్‌కి వస్తుంది.

శ్రీలంకదీ ఇంచుమించు భారత్ పరిస్థితే. 8 మ్యాచ్‌లు ఆడాల్సి ఉండగా.. ఏడు గెలిస్తేనే ఫైనల్ స్పాట్.

పాకిస్థాన్ ఆడాల్సిన మ్యాచ్‌లు 7. అన్నీ గెలిస్తేనే తుది పోరుకు అవకాశం. అయితే ఇతర జట్ల ఫలితాలు ఇక్కడ కీలకం.

వెస్టిండీస్, ఇంగ్లాండ్‌కి ఈ ఔజ సైకిల్‌లో ఫైనల్‌కి చేరే అవకాశం దాదాపు లేనట్లే. వరుస ఓటములే దీనికి కారణం.

ఫైనల్ ఎప్పుడో చెప్పలేదు కదా.. వచ్చే ఏడాది జూన్ 9 నుంచి 13 వరకు జరుగుతుంది. ఈ పోరుకు వేదిక లండన్‌లోని ఓవల్ మైదానం.




కోహ్లి ఆ విషయంలో రాజీపడడు..

# నా బెస్ట్ మూమెంట్ అదే : మాజీ ఫీల్డింగ్ కోచ్



టీమ్ఇండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీపై భారత మాజీ ఫీల్డింగ్ కోచ్ టి.దిలీప్ ప్రశంసలు కురిపించాడు. అతడు ఫీల్డింగ్‌లో చూపించే ఎనర్జీ అద్భుతమని.. ప్రాక్టీస్‌లో చూపించే ఉత్సాహాన్ని మ్యాచ్‌లోనూ ప్రదర్శిస్తాడని పేర్కొన్నాడు. విరాట్ ప్రభావం జట్టులోని మిగతా ఆటగాళ్లపై ఉంటుందని మాజీ ఫీల్డింగ్ కోచ్ తెలిపాడు. "కోహ్లి ఫీల్డింగ్‌లో రాజీపడడు. పవర్ ప్లేలో కవర్స్, షార్ట్ మిడ్ వికెట్‌లో డైవ్‌లు చేస్తూ బంతిని ఆపే విధానం అద్భుతంగా ఉంటుంది. బంతి తనవైపు రానప్పుడు కూడా అతడి ఫీల్డింగ్ ప్రయత్నాలు ఆగవు. ఇది నన్ను ఎంతగానో ఆకట్టుకుంది. టెస్టులు, టీ20లకు వీడ్కోలు పలికిన కోహ్లి.. ఈ దశలోనూ చివరి ఓవర్లలో లాంగాన్‌లో ఫీల్డింగ్ చేస్తాడు. అక్కడి నుంచి పరుగెత్తుకొస్తాడు. కోహ్లీతో కలిసి ఫీల్డింగ్ చేస్తున్నప్పుడు.. అతడిని స్ఫూర్తిగా తీసుకుని తమ సామర్థ్యాలకు మించి రాణించిన ఆటగాళ్లు కూడా ఉన్నారు. అది విరాట్ లెవల్" అని దిలీప్ వివరించాడు. "నా కెరీర్‌లో అత్యుత్తమ క్షణం గురించి ఆలోచిస్తే 2024 టీ20 ప్రపంచ కప్ గుర్తుకొస్తుంది. కేవలం ఆ ట్రోఫీ మాత్రమే కాదు, ఆ తర్వాత డ్రెస్సింగ్ రూమ్‌లో నెలకొన్న వాతావరణం. గత నాలుగేళ్లుగా ఆ కుర్రాళ్లు పడ్డ కఠిన శ్రమను నేను గ్రహించగలిగాను. ఆ అనుభూతిని ఎప్పటికీ నా మనసులో భద్రపరుచుకుంటాను" అని దిలీప్ తెలిపాడు. నవంబర్ 2021లో భారత జట్టులో చేరిన దిలీప్ ఇటీవల కోచ్ పదవికి రాజీనామా చేశాడు. అతను ఫీల్డింగ్ కోచ్‌గా ఉన్నప్పుడు టీమ్ఇండియా రెండు టీ20 ప్రపంచ కప్‌లు (2024, 2026), ఛాంపియన్స్ ట్రోఫీ (2025), రెండు ఆసియా కప్‌లు (2023, 2025) సాధించింది. 2023 వన్డే ప్రపంచ కప్, డబ్ల్యూటీసీలో రన్నరప్‌గా నిలిచింది.

సిరాజ్ కాదు..

# టీమ్ఇండియాకు అతనే ఎక్స్-ఫ్యాక్టర్

శ్రీలంక మాజీ ఆల్‌రౌండర్



శ్రీలంక, భారత్ మధ్య ఆగస్టు 15 నుంచి రెండు టెస్టుల సిరీస్ ప్రారంభంకానుంది. గాయం కారణంగా స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా అందుబాటులో లేకపోవడం టీమ్ఇండియాకు ఇబ్బందికరంగా మారింది. అయితే, గుర్నూర్ బ్రార్ భారత జట్టుకు ఎక్స్-ఫ్యాక్టర్ కాగలడని శ్రీలంక మాజీ ఆల్‌రౌండర్ ఫర్వేజ్ మహరూఫ్ అభిప్రాయపడ్డాడు. ప్రసిద్ధ్ కృష్ణ, అకిబ్ నబీ, గుర్నూర్‌లతో కూడిన పేస్ దళానికి సిరాజ్ నాయకత్వం వహిస్తాడు. తుది జట్టులో గుర్నూర్‌కు చోటు దక్కుతుందా? లేదా అనేది ఆసక్తికరంగా మారింది. "బుమ్రాకు రివర్స్ స్వింగ్ చేయగల సామర్థ్యం ఉంది. ముఖ్యంగా పాత బంతితో అద్భుతంగా రివర్స్ స్వింగ్ రాబడతాడు. అతను లేకపోవడం భారత్‌కు పెద్దలోటు కానుంది. సిరాజ్ మంచి బౌలరే. కానీ బుమ్రాతో పోల్చి చూసినప్పుడు మాత్రం కొంత తేడా కనిపిస్తుంది. వార్మప్ మ్యాచ్‌లో గుర్నూర్ బ్రార్ బౌలింగ్ చేసిన తీరు ఆకట్టుకుంది. అతను టీమ్ఇండియాకు ఎక్స్-ఫ్యాక్టర్ అవుతాడని అనుకుంటున్నా. అతని బౌలింగ్‌లో మంచి వేగం, బౌన్స్ ఉన్నాయి. గుర్నూర్‌లో పోరాట పటిమ ఉంది. అవసరమైతే దూకుడును ప్రదర్శించగలడు. నేను గనుక భారత జట్టు వ్యూహకర్తల బృందంలో ఉండి ఉంటే గుర్నూర్‌కు కచ్చితంగా ఒక అవకాశం ఇవ్వాలనుకునేవాడిని. అతను భారత్ తరపున కేవలం వైట్‌బాల్ క్రికెట్ మాత్రమే ఆడాడని నాకు తెలుసు. కానీ, అతని బౌలింగ్‌లో ప్రత్యేకత ఉంది. బ్యాటర్లయను దెబ్బతీయాల్సిన సందర్భాల్లో అతను వేసే చిన్నపాటి స్పెల్స్ అత్యంత ప్రమాదకరమైన ఆయుధంగా మారగలవు. రవీంద్ర జడేజా, కుల్‌దీప్ యాదవ్‌లకుతోడుగా మూడో స్పిన్నర్‌గా మానవ్ సుతార్‌ను తీసుకునే అవకాశముంది. రిషభ్ పంత్ విషయంలో శ్రీలంక జాగ్రత్తగా ఉండాలి" అని ఫర్వేజ్ మహరూఫ్ సూచించాడు.

# విండీస్‌కు అఫ్గాన్ ఎఫెక్ట్..

వరల్డ్‌కప్ డైరెక్ట్ క్వాలిఫికేషన్‌కు దూరం



ఒకప్పుడు అద్భుతమైన విజయాలతో ప్రపంచ క్రికెట్‌లో తిరుగులేని జట్టుగా వెలుగొందిన వెస్టిండీస్ ప్రభ కొన్నేళ్లుగా మసకబారుతోంది. గత వన్డే ప్రపంచ కప్‌నకు నేరుగా అర్హత సాధించలేకపోయిన వెస్టిండీస్.. తర్వాత క్వాలిఫయర్స్ లోనూ పేలవ ప్రదర్శన చేసి టోర్నమెంట్‌కు దూరమైంది. ఈ సారి కూడా విండీస్ అదే పరిస్థితిని ఎదుర్కొంటోంది. సోమవారం ఐర్లాండ్‌తో జరిగిన మూడో వన్డే మ్యాచ్‌లో అఫ్గానిస్థాన్ విజయం సాధించి ప్రపంచ కప్‌నకు నేరుగా అర్హత సాధించింది. దీంతో విండీస్ ఆశలు ఆవిరయ్యాయి. వన్డే ర్యాంకింగ్స్ ఆధారంగా నేరుగా టోర్నీకి అర్హత సాధించడానికి ఐసీసీ ఈ సెప్టెంబర్ 30 వరకు డెడ్‌లైన్ విధించింది. టాప్-8లో నిలిచిన జట్లు నేరుగా వరల్డ్ కప్‌నకు క్వాలిఫై అవుతాయి. ఆతిథ్య దేశాలుగా ఉన్న సౌతాఫ్రికా, జింబాబ్వేతో కూడా ఆటోమేటిక్ అర్హత సాధిస్తాయి. ఐర్లాండ్‌పై విజయంతో అఫ్గాన్ టాప్-8లోకి దూసుకొచ్చింది. భారత్, న్యూజిలాండ్, ఆస్ట్రేలియా, సౌతాఫ్రికా, పాకిస్థాన్, శ్రీలంక, ఇంగ్లాండ్, అఫ్గాన్, బంగ్లాదేశ్, జింబాబ్వే నేరుగా డైరెక్ట్‌గా క్వాలిఫై అయ్యాయి. కటాఫ్ తేదీ నాటికి విండీస్ రెండు వన్డేలు మాత్రమే ఆడనుంది. ఆ రెండూ సెప్టెంబర్‌లో భారత్‌తోనే జరగనున్నాయి. ఆ రెండింటిలో గెలిచినా అఫ్గాన్‌ను కరేబియన్ జట్టు వెనక్కినెట్టే అవకాశం లేదు. వెస్టిండీస్ 2027 వరల్డ్ కప్‌లో ఆడాలంటే 10 జట్లతో జరిగే ప్రపంచ కప్ క్వాలిఫయర్స్ ఆడాల్సి ఉంటుంది. ఇందులో ఐర్లాండ్‌తోపాటు క్రికెట్ వరల్డ్ కప్ లీగ్-2లో అత్యుత్తమ ప్రదర్శన చేసిన జట్లు, క్వాలిఫయర్ ప్లే ఆఫ్స్ నుంచి వచ్చిన జట్లు పాల్గొంటాయి. ఈ టోర్నీలో విండీస్ విజేతగా నిలిస్తే నేరుగా వరల్డ్ కప్ గ్రూప్ దశలో తలపడుతుంది. ఒకవేళ రెండు, మూడు, నాలుగు స్థానాల్లో నిలిస్తే సూపర్ సిరీస్‌లో తలపడాల్సి ఉంటుంది. అందులో అగ్రస్థానం దక్కించుకుంటే వరల్డ్ కప్‌లో చివరి బెర్తును ఖరారు చేసుకుంటుంది.






VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603(146158), viswamvoice@gmail.com